
వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే కందుల, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి

జగన్ అజ్ఞానానికి వెలిగొండే నిదర్శనం

- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- కొత్తూరు సమీపంలో టన్నెళ్ల పరిశీలన

త్రిపురాంతకం/దోర్నాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశానని చెప్పటం జగన్ మానసిక స్థితికి, అజ్ఞానానికీ నిదర్శనమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం దోర్నాల వద్ద కొత్తూరు సమీపంలో వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెళ్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అందరినీ మోసగించటం దగా చేయటం జగన్ నైజమని, అందులో భాగంగానే పశ్చిమ ప్రకాశం ప్రజలను కూడా మోసం చేసి పూర్తి చేయని ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశాడని అన్నారు. తల్లిని చెల్లిని మోసం చేసేవాడికి ప్రజలను మోసం చేయటం పెద్ద సమస్యేమి కాదన్నారు. వెలిగొండ రెండు టన్నెళ్ల పనులు పెండింగ్‌లో ఉండగానే,

మిగతా 6లో...

ఫోన్‌లో నగదు లావాదేవీలపై విచారణ

ఒంగోలు క్రైం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపుదాడి చేసి రెండు రోజుల పాటు తనిఖీలు చేశారు. అక్కడ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వద్ద ఉన్న 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్లలో నగదు లావాదేవీలు ఎక్కువ మొత్తంలో జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఆయా లావాదేవీలను విశ్లేషిస్తున్నారు. ఈ నగదు డాక్యుమెంట్ రైటర్ల నుంచి ఏమైనా బదిలీ అయిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. అదేక్రమంలో సెక్షన్ 22(ఏ) కింద ఉన్న భూములు ఏమైనా రిజిస్ట్రేషన్ చేసారా, చేస్తే ఎలా చేశారు, అందుకు ఎవరు బాధ్యులు అనీ లోతుగా పరిశీలిస్తున్నారు. ఎనీవేర్ డాక్యుమెంట్లు ఒంగోలులో ఎందుకు చేస్తున్నారు. అలాంటి డాక్యుమెంట్లు పెండింగ్ పెట్టిన తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తారు.. అలా ఏమైనా జరిగాయా అనీ రికార్డులను పరిశీలన చేస్తున్నారు. గిఫ్ట్‌డీడ్ల రిజిస్ట్రేషన్‌లో ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా? అనేది ఏసీబీ అధికారులు పరిశీలన చేస్తున్నారు.

సమన్వయం ముఖ్యం

జిల్లా సమగ్రాభివృద్ధికి సరైన ప్రణాళికతో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని మీకోసం కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశానికి ఆనం అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలు, వాటి పురోగతి, ఆయా శాఖలకు సంబంధించి ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై మంత్రి ఆనం అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో తాగునీటి సమస్యతోపాటు తుఫాన్ కారణంగా అనేక ప్రాంతాల్లో దెబ్బతిన్న కరెంటు స్తంభాలు, చెరువు గట్లు తదితరాలకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రహదారులు దెబ్బతిన్నాయన్నారు. త్వరలో మరోసారి సమావేశమై అన్ని విషయాలపై లోతుగా చర్చిద్దామన్నారు.

- ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

- జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసి పనిచేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- తుఫాన్ బాధితులను ఆదుకుందాం
- ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది
- మరోసారి సమావేశమై నష్టాలపై చర్చిద్దాం
- సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యేలు
- డీఆర్సీ సమావేశంలో అధికారులకు ఆదేశాలు
- నిబంధనల ప్రకారం సంక్షేమం అందించాలి



జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ రాజాబాబు

అన్ని విషయాలపై త్వరలో మళ్లీ చర్చిద్దాం



జిల్లాలో ఎక్కువ ఆలయాలు అటవీ శాఖ పరిధిలో ఉండటంతో మౌలిక సదుపాయాలు, వాటి అభివృద్ధికి కొంత ఇబ్బంది ఉంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో సమీక్షిస్తాం. త్వరలో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి వివరాలతో అధికారులను పిలిపించి చర్చిద్దాం. అటవీ శాఖ భూములు, హైవేల భూముల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేందుకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు కొంత వెసులుబాటు ఉంది. - ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి

సమన్వయంతో పనిచేయాలి



జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను, సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తాం.

-డాక్టర్ డీబీవీఎస్ స్వామి, మంత్రి

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



జిల్లాలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి. జలజీవన్ మిషన్ కింద జిల్లాకు రూ.2,140 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత పనులు చేపట్టి త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎంపీ నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి.

- మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

మా ఎమ్మెల్యేలు మంచోళ్లు
ఫిర్యాదులపై తొందరపడొద్దు
ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీలతో మంత్రుల ప్రత్యేక భేటీ
'స్థానిక' ఎన్నికలే లక్ష్యంగా సమీక్ష
6


డీఆర్సీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

పొగనారు మూట రూ.5000

- మడులు దెబ్బతినడంతో పెరిగిన ధరలు
- ఎర్రనేలల్లోనే ప్రస్తుతం ఏతలు

కొండపి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొగనారు ధర కొండెక్కి కూచుంది. మూడ్రోజుల క్రితం వరకు మూట నారు రూ.2000 నుంచి నాణ్యతను బట్టి రూ.2500 వరకు ఉంది. అయితే మూడ్రోజుల నుంచి మూట (ఆరువేల మొక్కలు) రూ.4200 పలికింది. శుక్రవారం రూ.5వేలకు చేరింది. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి, టంగుటూరు, పొన్నలూరు మండలాల్లో పెట్టిన పొగాకు నారుమడులు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ముసి, పాలేరు, అట్లేరు పరీవాహక తువ్వ నేలల్లో పెట్టిన నారుమడులు భారీగా దెబ్బతిన్నాయి. తెగుళ్లు, చీడపీడలు పెరగడంతోపాటు, వరద నీరు నారుమడులపైకి ఎక్కి ప్రవహించి నారుమడులు అనేక గ్రామాల్లో దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగు రోజులుగా మాత్రమే ఎండలు కాస్తున్నాయి. ముందుగా తేమ ఆరిపోయే ఎర్ర నేలల్లో మాత్రమే ప్రస్తుతం పొగాకు ఏతలు ప్రారంభమయ్యాయి. ఇంకా అధిక విస్తీర్ణంలో పొగాకు వేసే నల్లరేగడి నేలల్లో పొగాకు ఏతలు ప్రారంభం కాలేదు. ప్రధానంగా భారీ విస్తీర్ణంలో పొగాకు వేసే టంగుటూరు, కొండపి, కామేపల్లి, వావిలేటిపాడు రింగ్‌రోడ్డులో పొగాకు ఏతలు ప్రారంభం కాలేదు. టంగుటూరు మండల గ్రామాల్లో పొగాకు ఏతలకు మరో 20 రోజులకుపైగా సమయం ఉంది. అయితే జరుగుమల్లి, కొండపి మండలాల్లో పొలాలు తేమ ఆరిన వెంటనే పొగాకు వేయాల్సి ఉంది. ఎర్రనేలల్లో మాత్రమే ఇపుడు పొగ మొక్కల ఏతలు సాగాయి. ఒక్కసారిగా పొలాలు ఆరుదల రావడంతో రైతులు పొగ మొక్కల ఏతలు


తుఫాన్ దెబ్బను తట్టుకుని ఉన్న పెరిదేపిలోని నారుమడులు

మిగతా 6లో...

పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు

- ఇక నుంచి అవి స్వతంత్ర యూనిట్‌లు
- నాలుగు గ్రేడ్లుగా విభజిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం రానుంది. ప్రస్తుతం పంచాయతీలు క్లస్టర్ విధానంలో ఉండగా ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసి జిల్లాలోని 729 గ్రామపంచాయతీలను స్వతంత్ర యూనిట్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ గత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించారు. ఆయా పంచాయతీల్లో ఐదు గ్రేడ్లలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తుండగా ప్రస్తుతం మూడు గ్రేడ్లుగా మార్చారు. ప్రస్తుతం ఉన్న కార్యదర్శుల పోస్టుల పేరును కూడా మార్పుచేశారు. ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)గా పిలువనున్నారు.

స్వతంత్రంగా పనిచేసేలా ఏర్పాటు

జిల్లాలో 38 మండలాల మొత్తం 729 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 11, గ్రేడ్-1 పంచాయతీలు 75, గ్రేడ్-2 పంచాయతీలు 265, గ్రేడ్-3 పంచాయతీలు 373, ఐదు 500లోపు జనాభా ఉన్న పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను కంట్రీ ప్లానింగ్ సహాయకులుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఉద్యోగోన్నతులు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ప్రమోషన్ పొంది డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేస్తున్న అధికారులను అర్బన్

మిగతా 6లో...

గుర్తుతెలియని వాహనం ఢీ 7
- ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- వేంపాడు వద్ద ఘటన

కనిగిరి బాలికల వసతి గృహం మ్యాట్రిన్ సస్పెన్షన్
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో వేటు
7


మొక్కను నాటుతున్న మంత్రి ఆనం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 7
- ఒంగోలులో ఒకేరోజు 5వేల మొక్కలు నాటిన వైనం


మాట్లాడుతున్న లంకా దినకర్

రైతులు, కూలీల సమస్యలపై గళమెత్తిన నేత ఆచార్య రంగా
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్
- రంగాభవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు

మార్మోగిన వందేమాతరం

- జిల్లావ్యాప్తంగా గీతాలాపన
- ఘనంగా 150 ఏళ్ల వేడుకలు
- మంత్రులు ఆనం, స్వామి, నిమ్మల, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గీతాలాపన చేస్తున్న పోలీసులు, విద్యార్థులు



ఒంగోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వందేమాతరం గీతం మార్మోగింది. వివిధ ప్రాంతాల్లో గీతాలాపనతో పాటు మానవహారాలు, సభలు, సమావేశాలు ఇతర కార్యక్రమాలు జరిగాయి. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. స్వాతంత్ర్యపోరాట సమయంలో ప్రతి ఒక్కరినీ మేల్కొలిపేలా పోరాటంలోకి ఆకర్షించి స్ఫూర్తినిచ్చిన వందేమాతర గీతం తొలిసారి ఆలపించి 150 ఏళ్లు అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వేడుకలకు కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. తదనుగుణంగా దేశ వ్యాప్తంగా శుక్రవారం ఆ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. గీతం రచయిత బంకింగ్‌చంద్ర ఛటర్జీకి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రకాశం భవనం సమీపంలోని చర్చి సెంటర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, కలెక్టర్ రాజాబాబు పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు సందర్శనలో ఉన్న మంత్రి నిమ్మల రామానాయుడు దోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఆఫీసు ప్రాంగణంలో

మిగతా 6లో...

11న కేంద్ర బృందం రాక

- తుఫాన్ నష్టాల పరిశీలన
- షెడ్యూల్‌పై అధికారుల కసరత్తు

ఒంగోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 11న జిల్లాకు కేంద్ర బృందం రానుంది. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ నష్టాలను పరిశీలించేందుకు ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రంలో కేంద్ర బృందం పర్యటించనుంది. అందులో ఒక బృందం సభ్యులు జిల్లాలో పర్యటిస్తారని ప్రభుత్వం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. ఇందుకు సంబంధించిన అంశాలపై సీసీఎల్ఏ జయలక్ష్మీ సంబంధిత జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి జేసీ గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర కొందరు అధికారులు వీసీకి హాజరయ్యారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం 10వ తేదీ బాపట్లలో బస చేసే కేంద్ర బృందం 11వ తేదీ ఉదయం ఒంగోలు చేరుకొని జిల్లాలో తుఫాన్ నష్టాలపై అధికారులతో సమీక్ష చేసి ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. కొన్ని ప్రాంతాల్లో నష్టాలను పరిశీలిస్తారు. కేంద్ర బృందం పర్యటన ఏయే ప్రాంతాలలో అనే దానిపై అధికారులు దృష్టి సారించారు. శనివారంకు దీనిపై స్పష్టత రానుంది.

రేపు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అద్దంకి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజులు కోరారు. మెగా ఉచిత వైద్యశిబిరం జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లను శు క్రవారం టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు శంకరకంటి వైద్యశాలలో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు 7013723538, 7013898890 సెల్ నెంబర్లను సం ప్రదించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు కాకాని అశోక్, కుందారపు రామారావు, లహరి, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, రామాంజనేయులు, గుంజి శ్రీనివాసరావు, రామాంజనే యులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో ఉపయోగాలెన్నో...

మేదరమెట్ల , నవంబరు7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్లను ఉపయోగించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయని, అద్దంకి ఏడీఏ బి.ఎఫ్రాయం తెలిపారు. శుక్రవారం మండలంలోని రావినూతల, పమిడిపాడు గ్రామాల్లో రెండు గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 'డ్రోన్ కస్టమ్ హయ్యరింగ్' సెంటర్లకు 80 శాతం రాయితీతో డ్రోన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈడ్రోన్లను రైతులు ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల పిచికారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోలన్నారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు కాగా, రాయితీ రూ.7.80 లక్షలు పోను రూ.2 లక్షలు ఈ గ్రూపు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పమిడిపాడు సొసైటీలో రైతులకు 25 శాతం రాయితీపై శనగ విత్తనాలను సొసైటీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ వ్యవసాయాధికారులతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నక శ్రీధర్, మామిళ్లపల్లి హనుమంతరావు, కామినేని శ్రీనివాసరావు, పిన్నక శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ తదితర రైతులతో పాటు వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి నుంచి నగదు అపహరణ

- బ్యాంకులో రుణం కట్టేందుకు వెళ్లగా పథకం ప్రకారం చోరీ

ఇంకొల్లు, నవంబరు 7,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఓ వృద్ధుడి నుంచి ఇద్దరు దుండగులు రూ.3.90లక్షలు నగదును అపహరించుకొని వెళ్లిన ఘటన ఇంకొల్లులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంకొల్లుకు చెందిన చిలంకూరి కాంతయ్య(75) ఉదయం 11 గంటల సమయంలో బ్యాంకు ఆఫ్ ఇండియాలో తను తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు రూ.3.90లక్షలు తీసుకొని సైకిల్‌పై వచ్చాడు. అయితే బ్యాంకులో అప్పు రూ.4లక్షలు ఉందని అధికారులు తెలపడంతో మిగిలిన రూ.10వేలు తెచ్చుకునేందుకు ఇంటికి వెనుదిరిగారు. సైకిల్‌పై కాంతారావు బయలుదేరి ఇంటి సమీపంలోకి చేరుకోగా మోటార్‌సైకిల్‌పై ఇద్దరు దుండగులు వెంబడించి వెళ్లి రూ.100 నోట్లు రెండు కిందవేసి నీ డబ్బులు పడిపోయాయని చెప్పి యామార్చారు. వాటిని కాంతారావు తీసుకునే ప్రయత్నంలో ఉండగా సైకిల్ క్యారేజీపై ఉంచిన రూ.3.90లక్షల నగదు బ్యాగును వారు అపహరించుకొని పరారయ్యారు. గమనించిన బాధితుడు కాంతారావు ఇరుగుపొరుగువారికి విషయం తెలిపేలోపు వారు పరారయ్యారు. కాంతారావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మా ఎమ్మెల్యేలు మంచోళ్లు

- ఫిర్యాదులపై తొందరపడొద్దు
- ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీలతో మంత్రుల ప్రత్యేక భేటీ
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా సమీక్ష

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'మా ఎమ్మెల్యేలు మంచివాళ్లు చెబితే అర్థం చేసుకుంటారు. ఆవేశాలు, ఆక్రోశాలు ఉండవు. తూలనాడితే ససేమిరా.. అంటారు.' అని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా అధికారులతో వ్యాఖ్యానించారు. జిల్లాకు చెందిన మరో మంత్రి స్వామి కూడా ఎమ్మెల్యేలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే ప్రభుత్వ పథకాలు సమగ్రంగా ప్రజలకు అందుతాయని, ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం డీఎంసీ సమావేశం అనంతరం జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు, ముఖ్య కార్పొరేషన్ చైర్మన్లతో పాటు ఇటీవల జిల్లాకు వచ్చిన కలెక్టర్, ఎస్పీలతో ఇద్దరు మంత్రులు భేటీ అయ్యారు. పోలీసు అతిథి గృహంలో సాయంత్రం ఈ సమావేశం జరిగింది. తొలుత ఇన్‌చార్జీ మంత్రి ఆనం మాట్లాడుతూ కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజును జిల్లా పరిస్థితులన్నీ స్టడీ చేశారా? అని అడిగినట్లు తెలిసింది. మీ కోసం కార్యక్రమాల్లో వచ్చే ఫిర్యాదుల్లో నిజనిజాలను గుర్తించి స్పందించండని సూచించినట్లు తెలిసింది. రాజకీయ ఉక్రోశంతో కొందరు అసత్యాలతో కూడిన ఫిర్యాదులు చేస్తారని, తొందరపడి విచారణకు ఆదేశిస్తే గ్లోబల్ ప్రచారంతో ప్రభుత్వ లేక స్థానిక ఎమ్మెల్యేల ప్రతిష్ఠకు భంగం కలిగించవచ్చని మంత్రి అన్నట్లు తెలిసింది. మీ దష్టికి వచ్చే ఫిర్యాదుల్లో వివాదాస్పద అంశాలు ఉంటే స్థానిక ఎమ్మెల్యేలు ఇన్‌చార్జీల దృష్టికి తీసుకువెళితే లోటుపాట్లు తెలుస్తుందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గతంలో డివిజన్, మండల, ఆ కిందిస్థాయి ఉద్యోగుల బదిలీల్లో జరిగిన లోటుపాట్లు మళ్లీ జరగకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది. ఆ విషయంలో ఉన్నతాధికారులతోపాటు, ఎమ్మెల్యేలు కూడా అప్రమత్తంగా ఉండి అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాలని చెప్పినట్లు తెలిసింది. మంత్రి స్వామి మాట్లాడుతూ సమన్వయం లేకపోతే ప్రభుత్వ కార్యక్రమాలు దెబ్బతింటాయంటూ ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పినట్లు తెలిసింది. కలెక్టర్, ఎస్పీలతో ఇప్పటివరకు సమన్వయం బాగుందన్న అభిప్రాయాన్ని ఎక్కువమంది ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు వ్యక్తం చేశారు. గతంలో ఎదురైన కొన్ని సమస్యలు చెబుతూ అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఇద్దరు ఎమ్మెల్యేలు సూచించారు. వైపాలెం, దర్శి టీడీపీ ఇన్‌చార్జీలు కొన్ని సమస్యలు ప్రస్తావించగా నిబంధనల ప్రకారం వారు చెప్పే ప్రజా సమస్యలపై చర్యలు చేపట్టాలని మంత్రులు సూచించినట్లు తెలిసింది. పశ్చిమ ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే, ఒక రెవెన్యూ అధికారి అవినీతి వ్యవహారాలు ప్రస్తావిస్తూ తన అనుచరులు చెప్పారన్న పేరుతో మండల అధికారులు అవినీతికి పాల్పడుతుంటే కఠినంగా వ్యవహరించాలని కోరినట్లు తెలిసింది. కొత్త జిల్లా, డివిజన్ల పునర్విభజనపై కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని సూచనలు మంత్రులకు చేశారు.

దర్శిని ప్రకాశంలోనే ఉంచండి

దర్శి అసెంబ్లీ స్థానాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నాయకులు సాగర్‌లు ఈ సందర్భంగా ఇద్దరు మంత్రులకు, కలెక్టర్‌కు ప్రజలు, పార్టీ నాయకుల సంతకాలతో కూడిన వినతిని అందజేశారు. దర్శి ప్రకాశంలోనే ఉండాల్సిన అవశ్యకతను తెలిపే అనేక అంశాలను వినతిలో పొందుపరిచారు. ఇటు మంత్రులు, అటు కలెక్టర్ ఈ అంశాన్ని మంత్రుల సబ్‌కమిటీ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పింఛన్‌దారులు లైఫ్‌సర్టిఫికెట్లను జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సమర్పించాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు ఎస్‌బీఐ ఒంగోలు రీజియన్ పరిధిలో విస్తృత ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఆధార్ లింక్ అయిన స్మార్ట్ ఫోన్ ద్వారా పింఛన్‌దారులు తమ ఇంటి వద్దనుంచే జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు. లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించిన తర్వాత పింఛన్‌దారుల సెల్‌ఫోన్ నెంబర్లకు మేసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. పింఛన్‌దారులు భౌతికంగా లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించినా తమశాఖలలో ఆమోదిస్తామన్నారు. 80 సంవత్సరాలు పైబడిన వారు, అనారోగ్యంతో ఉన్నవారు సులభంగా జీవన్‌ప్రమాణ్ యాప్ ద్వారా తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పింఛన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పథకం ప్రకారమే దాడి



బాధితులను పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్

బండ్లమూడి బాధితులకు ఒంగోలు జీజీహెచ్‌లో పరామర్శ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలంలోని బండ్లమూడి గ్రామానికి చెందిన మాదిగలపై రెడ్డి సామాజికవర్గం నేతలు మూకుమ్మడిగా దాడి చేయడం దుర్మార్గమని, పథకం ప్రకారమే దాడి చేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బండ్లమూడి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన దాడి ఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బుధవారం ఉలవపాడు వద్ద జరిగిన రోడ్ ప్రమాదంలో గాయపడిన మహిళలను మందకృష్ణ మాదిగ పరామర్శించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని ఆయన బాధితులకు భరోసా కల్పించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండ్లమూడి దాడి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు, హత్యాయత్నం కేసు (307 చట్టం) నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ పొలంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారి గొర్రెలు పంటను తినేశాయని ప్రశ్నించినందుకు ప్రాణాలు తీసే స్థాయి వరకు పరిస్థితి వెళ్లిందన్నారు. ముఖ్యంగా పార్టీలకతీతంగా ఆ ఊరు మొత్తం ఒక్కటై బాధితులైన మాదిగ కుటుంబంపై విచక్షణారహితంగా మూకుమ్మడి దాడి చేశారని ఆయన అన్నారు. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న కానిస్టేబుల్ చూపిన చొరవ, బాధితుల పక్షాన నిలబడినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. బండ్లమూడి గ్రామ మాదిగలపై దాడి దుర్మార్గమని, దీనిపై ఎమ్మార్పీఎస్ రక్షణను కోరుతుందని తెలిపారు. చట్టాలను నిందితులకు చుట్టంగా చేయకుండా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, అధికారులు వాస్తవాలను గుర్తించి నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు, నగర అధ్యక్షులు గుంటూరు ప్రభుదాస్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధు బాబు, మహాజనసోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనంద్, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు టిక్షాలు, సర్వేపల్లి రవిరాజ్‌తోపాటు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ అపోహ మాత్రమే
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎమ్మెల్యే సాంబశివరావు (ఫైల్)

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అపోహ మాత్రమే అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం చేసే చర్యలను తమ ప్రభుత్వం చేపట్టదన్నారు. వైసీపీ రాజకీయ ఉచ్చులోనికి రైతులను లాగుతోందని, రైతులు ఆ ఉచ్చులో పడవద్దన్నారు. ఈ అంశానికి స్పందించిన పూర్వాపరాలను ఆయన వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం పీ4 పథకాన్ని చిత్తశుద్ధితో అమలుచేస్తున్నారన్నారు. సీఎం పిలుపు మేరకు ఈ పథకంలో భాగమయ్యేందుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త కారు మంచి ప్రసాద్ ముందుకు వచ్చాడన్నారు. బాపట్ల జిల్లా అప్పాపురం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మించి ప్రాంత రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పెట్ట బడి పెట్టేందుకు ముందుకు వచ్చాడన్నారు. అయితే డీపీఆర్ తప్పుల తడకగా ఉంద న్నారు. దానిపై సాంకేతిక పరంగా లోపాలు ఉన్నాయని గుర్తించి, ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే ఈ ప్రతిపాదనను తిరస్కరిం చిందన్నారు. ఈ పథకానికి సంబంధించి సాంకేతిక అంశాలపై తాను కూడా స్వయంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. ఈపథకం ఏర్పాటుకు సంబంధించి ఏమైన అనుమానాలు ఉంటే సంబంధితశాఖ మంత్రి, అధికారులతో నివృత్తి చేయించే బాధ్యత తనదేనని, రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే స్పష్టమైన భరోసా ఇచ్చారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ ఉచ్చులో పడవద్దన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొమ్మమూరు కాలువలను నిర్లక్ష్యం చేసిందని, కనీసం మరమ్మతులు కూడా కల్పించ కపోవడంతో కాలువ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధి కారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే చివరి భూములకు కూడా నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. రైతులు ఏ ప్రాం తంలో ఉన్నా, వారి ప్రయోజనాలు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమన్నారు.

జగన్ అజ్ఞానానికి వెలిగొండే నిదర్శనం

(5వపేజీ తరువాయి)

ఫీడర్ కాలువలు పూర్తి చేయకుండానే, నిర్వాసితులకు రూపాయి డబ్బులు ఇవ్వకుండానే ప్రాజెక్ట్ పని ఎలా పూర్తయిందని జాతికి అంకితం చేశారని మంత్రి ప్రశ్నించారు. కనీసం ఇక్కడి నిర్వాసితులు వచ్చి వారి సమస్యను చెప్పుకునేందుకు కూడా వారికి అవకాశం ఇవ్వకుండా జగన్ కార్యక్రమం రోజు ప్రాజెక్ట్ పరిసరాల్లో 144 సెక్షన్ పెట్టారన్నారు. కర్ఫ్యూ వాతావరణ సృష్టించి ప్రశ్నించేవారిని గృహనిర్బంధం చేసి తాను చేయాలనుకున్న మోసం ఇలా శిలాఫలకం రూపంలో ఆవిష్కరించి పోయాడని ఎద్దేవా చేశారు. ఇక్కడ జాతికి అంకితం పేరుతో నిర్మించిన శిలాఫలకం కోసం చేసిన ఖర్చు కొన్ని నిర్వాసిత కుటుంబాలకు ఉపయోగపడేదని, లేకుండా ప్రాజెక్ట్ పనిలో కొన్ని సిమెంట్ బస్తాల రూపంలో ఉపయోగపడే వని చెప్పారు. అటువంటి మోసగాళ్లను భవిష్యత్తులో మళ్లీ నమ్మకుండా తమకు అండగా నిలవాలని, ఎలాగైనా తమ ప్రభుత్వం ప్రాజెక్ట్ పూర్తికి కంకణం కట్టుకుని రాత్రింబవళ్లు పనిచేస్తుందన్నారు.

2026లో వెలిగొండ ద్వారా నీళ్లు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలిగొండను పూర్తి చేసేందుకు నిత్యం తమతో సమీక్షిస్తున్నారని 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆయనే ప్రాజెక్టను ప్రారంభిస్తారని మంత్రి నిమ్మల చెప్పారు. 2026 ఆగస్టు కల్లా వెలిగొండ పూర్తి చేసి నీరివ్వాలనే సంకల్పంతో రాత్రింబవళ్లు పనిచేస్తున్నామని చెప్పారు.

కొన్ని ఆటంకాలతో పనుల్లో జాప్యం జరిగింది తప్ప తమ ప్రభుత్వం వచ్చాక ప్రణాళిక ప్రకారం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తుఫాను వల్ల టన్నెళ్లలోకి నీరు చేరటం, ఫీడర్ కాలువ దెబ్బతినటం వంటి ఆటంకాలను అధిగమించి పనులు వేగంగా జరిగేలా చూసేందుకు అధికారులకు కూడా ఒక యాక్షన్ ప్లాన్ ఇచ్చామన్నారు. ఇప్పటికే రూ.456 కోట్లతో టెండర్లు పూర్తయి ఫీడర్ కాలువ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభించబోతున్నామన్నారు. 2026లో ప్రాజెక్ట్ ప్రారంభించి నీరివ్వటం ఖాయమని అంతకు ముందుగానే నిర్వాసితుల సమస్య కూడా పరిష్కరించి వారికి ఇవ్వాల్సిన ప్యాకేజీని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

డీఆర్‌సీలో ఎవరేమన్నారంటే..

పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం మంజూరుచేయాలి



టంగుటూరు పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరింది. అందువల్ల నూతన భవనాన్ని మంజూరుచేయాలి. సింగరాయకొండ, టంగుటూరు సూరారెడ్డిపాలెం వద్ద ఆర్వోబీ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆక్వా రంగం దెబ్బతిన్నది. అందువల్ల రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలి.

- దామచర్ల సత్య, మారిటైం బోర్డు చైర్మన్

జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేయాలి

జిల్లాకు మంజూరైన జలజీవన్ మిషన్ కింద ఇంతవరకు ఎన్ని పనులు పూర్తిచేశారు? ఎంత ఖర్చుచేశారు? అధికారులు వివరించాలి. కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున ఆ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

- లంకా దినకర్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్

జాతీయ రహదారులను పునరుద్ధరించాలి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. అందువల్ల వాటిని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై విచారణ చేయాలి.

- నూకసాని బాలాజీ, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్

అమృత్ కింద చేపట్టిన పనులు సత్వరమే పూర్తిచేయాలి

ఒంగోలు నగర ప్రజలకు తాగునీటి సరఫరాతోపాటు అమృత్ పథకం కిందచేపట్టిన



పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. 2014-19లో గుండ్లకమ్మ నుంచి తాగునీటి కోసం పైపు లైను పనులు చేపట్టారు. అందులో 85శాతం పనులు పూర్తయింది. మిగిలిన 15శాతం పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

-దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎమ్మెల్యే

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



2014లో మూడు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరా బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున వాటిని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇటీవల కురిసిన వర్షాలకు కంభం చెరువు కింద అరటి పంట దెబ్బతిన్నది. ఆ రైతులను ఆదుకోవాలి. నల్లమల అటవీ ప్రాంతంలో పంట పొలాలకు అడవి పందుల బెడద ఉంది. సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ యూనిట్లు మంజూరు చేయాలి.

-ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే

రైతులను ఆదుకోవాలి

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూ డాలి. రోడ్లు ధ్వంసమయ్యాయి. వాటిని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలి. మార్కాపురం నియోజకవర్గంలో అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలి. రెవెన్యూ సమస్యలు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించే విధంగా చూడాలి.

- కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

రోడ్లను పునరుద్ధరించాలి

భారీవర్షాల కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు నీటిని వదలడంతో అనేక గ్రామాల్లో రోడ్లు, పంటలు నీటమునిగాయి. ఈ రోడ్లను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలి. నల్లబర్లీ పొగాకు అమ్మకాలు లేక రైతులు



ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఆ రైతులను ఆదుకోవాలి.

- బీఎన్. విజయ్‌కుమార్, ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే

రక్షిత నీటిపథకాలను త్వరగా పూర్తిచేయాలి



నియోజకవర్గంలో చేపట్టిన రక్షిత మంచి నీటి పథకాలను త్వరగా పూర్తిచేయాలి. కనిగిరి నియోజకవర్గ పరిధిలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చూడాలి.

-డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే

ప్రభుత్వాస్పత్రిలో రూములకు డబ్బులు వసూలు

వైపాలెం ప్రభుత్వాస్పత్రిలో రూములు కేటాయింపునకు సంబంధించి వైద్యులు రోజుకు వెయ్యి రూపాయలు తీసుకుంటున్నారు. పాలుట్ల వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. ఆ రోడ్డును పునరుద్ధరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

- తాటిపర్తి చంద్రశేఖర్, వైపాలెం ఎమ్మెల్యే

ప్రజాప్రతినిధులప్రస్తావించిన అంశాలపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. ఆయా అంశాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

- రాజాబాబు, కలెక్టర్

గంజాయి అరికట్టేందుకు చర్యలు

జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లాలో శాంతిభద్రతలకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. పోలీస్‌శాఖ పరంగా కొన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి.

-ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

లారీల్లోని బ్యాటరీలు చోరీ

బల్లికురవ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నుపల్లి రోడ్డులో గ్రానైట్ ఫ్యాక్టరీలోని లారీల నుంచి ఆరు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నిలిపి ఉంచిన లారీల నుంచి బ్యాటరీలు చోరీ కావడంతో లారీల యజమానులు ఆందోళనకు గురవు తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడుచు కుంటూ వెళుతున్న వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ఘటన వేటపాలెం మండలం జాతీయ రహదారిలోని గాయత్రి రెస్టారెంట్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక జబ్బార్ కాలనీకు చెందిన షేక్ షాహీద్(60) కాలినడకన రెస్టారెంట్ వైపు నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.



ఉపాధి హామీ రికార్డులున్న బీరువాను బయటపెడుతున్న సిబ్బంది

వైసీపీ ఎంపీపీ దౌర్జన్యం

- ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల బీరువా, రికార్డులు బయటపెట్టించిన వైనం

తర్లుపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ తర్లుపాడు ఎంపీపీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి హామీ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ హాలులో ఫీల్డ్ అసిస్టెంట్లు కానీ, టెక్నికల్ అసిస్టెంట్లు కానీ కూర్చోకూడదని వారిపై దుర్భలాడారు. శుక్రవారం సమావేశ హాలులో ఉన్న ఉపాధి హామీ సంబంధించి రికార్డులను, బీరువాను అటెండర్ల చేత బయట పెట్టించి, సమావేశం హాలుకు ఎంపీపీ తాళం వేసుకుని వెళ్లిపోయారు. దీంతో ఉపాధి హామీ సిబ్బంది ఏమీ చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పొగనారు మూట రూ.5 వేలు

(5వపేజీ తరువాయి)

ప్రారంభించారు. దీంతో పొగాకు నారు ధర పెరిగింది. రానున్న రోజుల్లో ఎంత ధర పెరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొగనారు ఉంటే డబ్బులే డబ్బులు

కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో అనేక గ్రామాల్లో పెట్టిన పొగాకు నారుమడులు అధికశాతం తుఫాన్ కారణంగా దెబ్బతిన్నాయి. ఎకరానికి ఒకటిన్నర లక్ష వరకు ఇప్పటి వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తుఫాన్ తట్టుకుని నారుమడి బతికి ఉంటే ప్రస్తుతం ఎకరం రూ.5 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. నారుమడుల కొనుగోలుదారులు కూడా పెరిగారు. పొగాకు నారుకు డిమాండ్ మరో పక్షం రోజులు మాత్రమే ఉంటుందని, తర్వాత ఉండదని, తిరిగి పొగాకు నారుమడులు కొందరు రైతులు పెడుతున్నారు. అంతటా నీరు సంవృద్ధిగా ఉండటంతో ఆలస్యంగానైనా పొగ మొక్కలు వేసుకుని, తర్వాత నీరు పెట్టుకోవచ్చని కొందరు రైతులు భావిస్తున్నారు.

పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు

(5వపేజీ తరువాయి)

పీడీవోలుగా నియమించనున్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల రికార్డులను డిజిటలైజేషన్, రియల్ టైమ్ మానిటరింగ్ ఏర్పాటు చేయనున్నారు. రానున్న రోజుల్లో గ్రామపంచాయతీలు స్వతంత్రంగా పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడనున్నాయి.

డివిజన్లవారీగా పంచాయతీల వివరాలు ఇలా ..

డివిజన్	మండలాలు	స్పెషన్‌గ్రేడ్	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3	500లోపుజనాభా
ఒంగోలు	12	03	38	85	82	02
కనిగిరి	13	01	15	86	175	03
మార్కాపురం	23	07	22	94	106	00
మొత్తం	38	11	75	265	373	05

మార్మోగిన వందేమాతరం

(5వపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబులతో పాటు పలువురు అధికారులతో కలిసి మంత్రి నిమ్మల వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో భారీగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో గీతాలాపన చేశారు.

చీరాల, పొన్నూరులో మొబైల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు

- చీరాల్లో ఈనెల 10, పొన్నూరులో 11వ తేదీన అవకాశం

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ఈనెల 10న చీరాల మహిళ మండలి వద్ద, 11వ తేదీన పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ పోర్ట్ మంత్రిత్వశాఖ, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నసేవలను పొందేందుకు వివరాలకు 86625 70050ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

తీరంలో ఎంపీ, కలెక్టర్ విస్తృత పర్యటన

- తుఫాన్ ప్రభావంతో కూలిన వంతెనల పరిశీలన
- వెంటనే నిర్మాణాలకు ఆదేశాలు

వాడరేవు(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం తీర ప్రాంతాల్లో శుక్రవారం ఎంపీ కృష్ణ ప్రసాద్, కలెక్టర్ డావినోద్‌కుమార్‌తో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా తుఫాన్ ప్రభావంతో కూలిన కల్వర్టులు, చప్టాలు పరిశీలించారు. రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంపై ఆరా తీశారు. కూలిన చోటల్లా వంతెనల ఏర్పాటుకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. మొత్తం మూడు వంతెనలు, ఒక చప్టాకు సంబంధించి సుమారు రూ. రూ. 6 కోట్లుతో హై లెవల్ వంతనెలకు చర్చలు జరిపారు. వారివెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ ఇతర సిబ్బంది ఉన్నారు.

కేజీఎం విద్యార్థినులకు బంగారు పతకం

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏలూరులో నిర్వహించిన 69వ అండర్-17 తైక్వాండో పోటీల్లో స్థానిక కేజీఎం బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ తాహిరా ఉత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం దక్కించుకొని బంగారు పతకం సాధించింది. అలాగే తస్లీమా సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సవరణ

తేది.07-11-2025, ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రకాశం జిల్లా, 6వ పేజీలో ప్రచురించబడిన ఎయిడెడ్ పోస్టుల భర్తీ ఉద్యోగ ప్రకటనలో G.O.Ms No. 30 School Education (PS) dated 11-07-2025 లోని నిబంధనలు కూడా వర్తించబడును గమనించగలరు.

ఇట్లు : కరస్పాండెంట్
శివసాయి ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్
మార్కాపురం, ప్రకాశం జిల్లా



చర్చి సెంటర్‌లో విద్యార్థులతో నిర్వహించిన మానవహారం

వందేమాతర గీతం భారతీయులందరికీ గర్వకారణం

● ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతర గీతం భారతీయులందరికీ గర్వకారణమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈ గీతాన్ని మొదటిసారి ఆలపించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక చర్చిసెంటర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ఈ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ భారతీయులందరూ ఒకేటనని ఐక్యతను చాటుతూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం గొప్పదనాన్ని మరోసారి నేటి తరానికి కూడా తెలియజేసేలా కేంద్ర ప్రభుత్వం ఈ గీతాలాపనకు పిలుపునిచ్చిందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ తరాలు మారినా వన్నె తరగని గీతం వందేమాతరం అన్నారు. దీని విశిష్టతను అందరూ తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. కలెక్టర్ పీరాజాబాబు మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్యోద్యమ సమయంలో ప్రజల్లో శక్తిని నింపిందన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ కోట్లాదిమందిని ఏకతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేశు తదితరులు ఉన్నారు.

నకిలీ ఎరువులపై కేసు నమోదు



బ్యాగుల్లోని ఎరువును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు బుజ్జిబాయి, లక్ష్మీనారాయణలు

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రైతులకు విక్రయించేందుకు నకిలీ ఎరువులను తరలిస్తున్న వారిపై టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం.. మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి ఫిర్యాదు మేరకు... గ్రామాల్లో రైతులకు అమ్మేందుకు తరలిస్తున్న లారీలోని 300 బస్తాలను గురువారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా తెలంగాణకు చెందిన మాకి రమ్య, తమ్మళ్ల గోపి, కండెపూడి గౌతమ్‌లు రాగా గోల్డ్ కంపెనీ పేరుతో సీఎంఎస్‌ను తక్కువ ధరకు రైతులకు అమ్ముతామని నమ్మబలికారు. అంతేకాక ఐదు బస్తాలు కొంటే ఒక లీటరు పురుగు మందు కూడా ఇస్తామని ఆశచూపారు. మార్కాపురం మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల వద్ద తొలుత రూ.200 మేరకు అడ్వాన్స్‌లు కూడా తీసుకున్నారు. ఎరువులు ఇచ్చిన తర్వాత మిగిలిన రూ.వెయ్యి చెల్లించేలా మాట్లాడుకున్నారు. ఒప్పందం మేరకు గురువారంరాత్రి కంభం రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద ఓ లారీని నిలిపి ఆటోల్లో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఏవో బుజ్జిబాయి వెంటనే విషయాన్ని వ్యవసాయశాఖ ఏడీ బాలాజీనాయక్‌కు తెలిపారు. ఆయన సూచన మేరకు పెద్దారవీడు ఏవో లక్ష్మీనారాయణతో కలిసి బుజ్జిబాయి ఎరువులను పరిశీలించారు. ఆటోలోని వారి సమాచారం మేరకు పెట్రోల్ బంక్ వద్ద ఉన్న లారీని కూడా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎరువుల శాంపిల్స్‌ను బాపట్లలోని ఎఫ్‌సీవో ల్యాబ్‌కు పంపారు.

కనిగిరి బాలికల వసతి గృహం మ్యాట్రిన్ సస్పెన్షన్

ఒంగోలునగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహం మ్యాట్రిన్ కె.చంద్రకుమారిని కలెక్టర్ రాజాబాబు శుక్రవారం సస్పెండ్ చేశారు చంద్రకుమారి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తేలటంతో ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే మ్యాట్రిన్ వసతి గృహంలోని విద్యార్థినుల పట్ల దురుసుగాప్రవర్తించటం, మెనూ సక్రమంగా అమలు చేయక పోవటం, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక పోవటం వంటి పలు ఆరోపణలు ఉన్నాయి. ఆమెపై విద్యార్థినులు స్థానిక శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డికి కూడా ఫిర్యాదు చేశారు. గతంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ వసతి గృహాన్ని సందర్శించి పలు లోపాలను గుర్తించారు. అయినా పద్ధతి మారకపోవటంతో ఆమెపై వచ్చిన ఆరోపణలపై కనిగిరి సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి పి.శివనాయక్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా చంద్రకుమారిని సస్పెండ్ చేశారు.

WALK-IN-INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకుల కోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు.
అర్హత కలవారు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

ఆంధ్రజ్యోతి

చీరాల జోన్ అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్(ACO)

- అభ్యర్థి తన జోన్ పరిధిలోని ఏజెంట్లను, SRలను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చే విధంగా పని చేయవలసి ఉంటుంది.
- అభ్యర్థి కనీస అర్హత ఇంటర్ / డిగ్రీ, సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను.

అర్హత, అనుభవమును బట్టి వేతనం నిర్ణయించబడును.

డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్(SR), చీమకుర్తి

- అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను సేల్స్ ప్రమోటర్లను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చే విధంగా పని చేయవలసి ఉంటుంటి.
- అభ్యర్థి కనీస అర్హత 10th/ఇంటర్...

పై అర్హతలు కల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు

ఇంటర్వ్యూ తేది : 11-11-2025 | ఉ॥ 10.00 నుండి మ॥ 2 గంటల వరకు

ఇంటర్వ్యూ స్థలము
ఆంధ్రజ్యోతి కార్యాలయం
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 206/2,3, చీరాలరోడ్, త్రోవగుంట గ్రామం, ఒంగోలు రూరల్ (మం), ప్రకాశంజిల్లా - 523 262
D.C.M: 9985411484 B.M: 9985411481

ఒంగోలులో ఆనం.. దోర్నాలలో నిమ్మల

జిల్లాలో ఒకే రోజు ఇద్దరు కీలక మంత్రుల పర్యటన
డీఆర్సీ, ఇతర కార్యక్రమాలకు హాజరు
ఇరువురూ ఒకే రోజు రావడంతో కొంత గందరగోళం

జిల్లాలో ఒకే రోజు ఇరువురు కీలక మంత్రులు పర్యటించారు. అందులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాగా మరొకరు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. ఇరువురు ప్రధాన అంశాలపై జిల్లాలో ఒకే రోజు పర్యటించడంతో అటుప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల్లోనూ కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. అయితే ఆ పరిస్థితిని అధిగమించి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించుకొని సఫలం అయ్యారు.

ఒంగోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చాలారోజుల క్రితంనుంచి వాయిదాపడుతూ వస్తున్న డీఆర్సీ సమావేశాన్ని ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం నిర్వహించగా పశ్చిమ ప్రాంతానికి అత్యంతప్రధానమైన వెలిగొండ సందర్శనకు ఆశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వచ్చారు. దీని వల్ల నెలకొన్న గందరగోళ పరిస్థితితో పశ్చిమ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు డీఆర్సీ సమావేశానికి హాజరు కాలేక ఇబ్బంది పడ్డారు. అదే సమయంలో జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇతర పలువురు ఎమ్మెల్యేలు వెలిగొండకు సంబంధించి నిమ్మల పర్యటనలో పాల్గొనలేకపోయారు. అయితే ముందుగా ఇలాంటి సమస్య రాకుండా తగు సమన్వయం చేసుకోవడంలో వారి లోపం ఎవ్వరిదైనా ఒకే రోజు ఇరువురు కీలక మంత్రులు కార్యక్రమాలతో ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనక తప్పలేదు. ఆ విషయం అలా ఉంచితే ఇరువురు మంత్రుల షెడ్యూల ప్రకారం నిర్దేశించుకున్న కార్యక్రమాలు ఎక్కడికక్కడ విజయవంతంగానే జరిగాయి. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి డీఆర్సీ సమావేశంతో పాటు పలు ఇతర కార్యక్రమాలకు హాజరై సాయంత్రం వరకు బిజీబిజీగా గడిపారు. అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు ఒంగోలు చేరుకున్న ఆనం జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు, అధికారులో కలిసి తొలుత కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వందేమాతరం గీతం 150 ఏళ్ల వేడుకలకు హాజరయ్యారు. అక్కడినుంచి ఎమ్మెల్యే జనార్దన్ నివాసానికి వెళ్లి ఇతర కీలక ప్రజాప్రతినిధులతో కలిసి అల్పాహార విందు స్వీకరించిన అనంతరం వారంతా ఆచార్యరంగా జయంతి సందర్భంగా స్థానిక ఏఎంసీ వద్ద ఆచార్యరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడినుంచి స్థానిక అంజయ్య రోడ్డులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్కలునాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రకాశం భవనంలో డీఆర్సీ సమావేశానికి హాజరయ్యారు. సుమారు మూడున్నర గంటల పాటు అది నిర్వహించి భోజన అనంతరం స్థానిక పోలీస్ అతిథి గృహంలో జిల్లా పార్టీ సమన్వయకమిటీ సమావేశాన్ని ఇన్‌చార్జిమంత్రి నిర్వహించారు. ఇలా బిజీ షెడ్యూల్, కొంత ఆలస్యం కావడం, వెలిగొండ ప్రాజెక్టుకు మంత్రి నిమ్మల రావడం వల్లడీఆర్సీ సమావేశం కొంత ఆలస్యంగా, మరికొంత తక్కువ సమయం జరగడం, పశ్చిమానికి చెందిన కొందరు ప్రజప్రతినిధులు హాజరు కాలేక ఇబ్బంది పడ్డారు. అయితే భోజనం అనంతరం ఇన్‌చార్జి మంత్రి ముఖ్య ప్రజాప్రతినిధులు, నేతలతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు అందరూ హాజరయ్యారు. జిల్లా అభివృద్ధి, రాజకీయ అంశాలు, త్వరలో మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆ సమావేశానికి రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధనరాజులు కూడా హాజరయ్యారు. పాలనాపరమైన అంశాలు, వివిధ నియోజకవర్గాల్లో కొన్ని అంశాలపైనా వారితో మాట్లాడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వెలిగొండ ఫీడర్‌కాలువ ఇటీవలి భారీ వర్షాలకు పలుచోట్ల తెగిపోవడం, టన్నెల్‌లోకి సగం దూరం వర్షపునీరు పోవడం వంటి అనేక అవాంతరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పరిశీలించారు. గురువారం రాత్రికే దోర్నాల వచ్చి బస చేసిన మంత్రి నిమ్మల ఉదయాన్నే ఆయా ప్రాంతాలను పరిశీలించి అధికారులతో సమీక్ష చేశారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తికి మరోసారి హామీ ఇచ్చారు. త్వరలో ఫీడర్ కాలువ ఆధునికీకరణ చేపట్టనున్నట్లు స్పష్టం చేసి ఆప్రాంత ప్రజలకు వెలిగొండపై మరోసారి భరోసా ఇచ్చారు. అయితే మంత్రి నిమ్మల పర్యటన మరో రోజు అయితే జిల్లాకు చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, కీలక అధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమైంది.



మెగా ప్లాంటేషన్‌పై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఇన్‌చార్జి మంత్రి ఆనం
పండుగలా మెగా ప్లాంటేషన్
నగరంలో ఒకే రోజు 5వేల మొక్కలు నాటిన నేతలు, విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరంలో ఐదు వేల మొక్కలను నాటాలనే లక్ష్యంతో స్థానిక అంజయ్య రోడ్‌లోని ఏకేవీకే కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర కమిషనర్ కే. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ ఆదేశాలతో కార్పొరేషన్ అధ్వర్యంలో పండుగ వాతావరణంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి ఆనంతోపాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ పచ్చదనానికి, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం మెరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి శ్రీకారం పలికిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఒకే రోజు 5వేల మొక్కలు నాటడంతోపాటు, వాటి పరిరక్షణ బాధ్యతను కార్పొరేషన్ యంత్రాంగం, పలు కళాశాలల విద్యార్థులకు అప్పగించినట్లు తెలిపారు. నగరంలోని ఎనిమిది ప్రధాన రహదారుల వెంట పది కాలేజీల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఒకే రోజు ఒకే సమయంలో వేల మొక్కలు నాటించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆచార్య ఎన్జీ రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే దామచర్ల, ఒడా చైర్మన్ రియాజ్‌లు ప్రజలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.

రైతులు, కూలీల సమస్యలపై గళమెత్తిన నేత ఆచార్య రంగా

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్
రంగాభవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు

ఒంగోలు (రూరల్),నవంబరు7(ఆంధ్రజ్యోతి): దేశంలోని రైతులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళమెత్తిన నాయకుడు, ప్రపంచ రైతు ఉద్యమనేత, పద్మవిభూషణ్ ఆచార్య ఎన్‌జీరంగా అని ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఒంగోలు సంతపేటలోని ఆచార్య ఎన్‌జీ రంగా భవన్‌లో శుక్రవారం రంగా జయంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ వద్ద గల ఆచార్య రంగా కాంస్య విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎంఎల్‌ఏలు దామచర్ల జనార్దనరావు, అశోక్ రెడ్డి, బీఎన్ విజయకుమార్, టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, మేయర్ సుజాతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రంగా భవన్‌లో జరిగిన జయంతి కార్యక్రమానికి రంగాభవన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లంకా దినకర్ మాట్లాడుతూ రైతుల హక్కులు, సంక్షేమం కోసం పోరాటాలు చేసిన వ్యక్తి రంగా అని తెలిపారు. రైతులు, కూలీల కోసం నిరంతర పోరాటం చేయటంతో ఎన్‌జీ రంగా గిన్నిస్ బుక్‌లో ఎక్కారని అన్నారు. ప్రపంచరైతు మహాసభలలో రైతుల హక్కులు, సంక్షేమం కోసం గళమెత్తిన ఉద్యమ స్ఫూర్తి గల నాయకుడు అని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం డిమాండ్‌తో కూడిన ప్రసంగం చేశారన్నారు.



ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి సభలో ఉత్తమ రైతు చుండూరి శ్రీరామూర్తిని సన్మానిస్తున్న రంగా భవన్ నాయకులు

రైతు నాయకుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇతర దేశాలనుంచి పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకోవటంతో మనదేశ రైతులు దగ్గర గల ధాన్యాన్ని కొనుగోలు చేసే వారు కరువు అయ్యారని తెలిపారు. ఆ నాడు రంగా చేసిన పోరాటాల ఫలితంగానే రైతులకు పలురకాల సంస్కరణలు చేశారన్నారు. మరో రైతు నాయకుడు పావులూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్‌జీరంగాను స్ఫూర్తిగా తీసుకొని రైతు సంఘాల నాయకులు పంటలకు గిట్టుబాటు ధరల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమరైతు చుండూరి శ్రీరామూర్తిని, ఉత్తమ పీఏసీఎస్ ఉప్పుగుండూరు చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబును, కనపర్తి ఎత్తిపోతలపథకం చైర్మన్ ఈదర వెంకటకృష్ణను, ఉత్తమ పశు పోషకులు నవులూరి సురేంద్రమోహనరావు, ఉత్తమవ్యవసాయ విద్యార్థి గొర్లె శిరీష (పదివేలు చెక్కు),ఉత్తమ వ్యవసాయ ఇంజినీరింగ్ విద్యార్థి పసుమర్తి ప్రణతి(పదివేలు చెక్కు), ఉత్తమపొగాకు రైతు తాటికొండ రమణయ్య(ఐదువేలు చెక్కు)లను సన్మానించి,మెమెంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, రంగా భవన్ కార్యదర్శి చుంచు శేషయ్య, నాయకులు నామినేని మోహనరావు, నాదెండ్ల చంద్రశేఖరరావు, గుండవరపు కోటేశ్వరరావు, తాతారావు, మండవ రంగారావు, మండవ శ్రీనివాసరావు, బోడపాటి కోటేశ్వరరావు, నాగినేని అవనీంద్రప్రసాద్, ధూళపాళ్ల వీరనారాయణ, మారెళ్ల రామకృష్ణ, మాజీ సైనిక సంక్షేమసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆచార్య ఎన్‌జీ రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రులు, ఎంఎల్‌ఏలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121. 129. 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

గుర్తుతెలియని వాహనం ఢీ ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

వేంపాడు వద్ద ఘటన



మృతి చెందిన విద్యార్థులు

ముండ్లమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈప్రమాదంలో మండలంలోని వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన చాట్ల వంశీ (20) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన అద్దంకి పట్టణానికి చెందిన షేక్ మాసుం సుభానీ(19) అద్దంకి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతులు అద్దంకి నుంచి ద్విచక్ర వాహనంపై వేంపాడు వస్తున్నారు. ఈక్రమంలో బాబుమియా డెయిరీ వద్ద దర్శి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఎదురుగా ఢీకొట్టడంతో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సుభానీని అద్దంకి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కె.కమలాకర్ సిబ్బందితో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ఆస్పత్రికి, సుబానీ మృతదేహాన్ని అద్దంకికి తరలించారు. మృతులిద్దరూ అద్దంకిలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు సమాచారం. దర్శి సీఐ వై.రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు పాఠశాలలకు పనిదినం

● తుఫాన్, వర్షాల నేపథ్యంలో ఇచ్చిన సెలవులకు ప్రతిగా నిర్వహణ

ఒంగోలు విద్య, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రెండవ శనివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికి పాఠశాలలకు మాత్రం పనిదినమే. జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో కలెక్టర్ అదేశాల మేరకు గత నెలలో ఐదు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. తుఫాన్ కారణంగా పాఠశాలలకు ప్రకటించిన సెలవులకు ప్రతిగా నవంబరు 8, డిసెంబరు 13, వచ్చే ఏడాది జనవరి 25,ఫిబ్రవరి 14, మార్చి 14 రెండవ శనివారాలు పాఠశాలలు నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలలను వచ్చే ఏడాది మార్చి వరకు రెండవ శనివారం సెలవు దినమైనప్పటికి పాఠశాలలను నిర్వహించాలని ఆదేశిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

విధుల్లోనూ క్రీడాస్ఫూర్తి చాటండి

● రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు
● అనంతలో ఘనంగా ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులు కలిసికట్టుగా క్రీడాపోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని విధుల్లోనూ ప్రదర్శించి సత్ఫలితాలు సాధించాలని ఆమె అభిలషించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ స్టేడియంలో ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి ఆమె క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి మాట్లాడుతూ అనంతపురంలో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనంతపురంలో పోటీలు నిర్వహించడం గొప్ప అనుభూతిని ఇస్తోందన్నారు. అనంతరం నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో కాకినాడ జిల్లా మొదటి, అనంతపురం ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానంలో నిలిచాయి.

ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజు క్లాసిఫైడ్స్

వెంటనే కావలెను

ఒంగోలు కర్నూలురోడ్డు, జాకీ స్టోర్ నందు పనిచేయుటకు అనుభవంగల సేల్స్ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్: 99898 48485
AJO-241169

మధువర్షిణి మ్యారేజెస్

గత 24 సంవత్సరాల నుండి అన్ని కులముల వారి సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, గ్రూప్ ఆఫీసర్స్, అబ్రాడ్, VIP, వారికి 1వ, 2వ పెళ్లి సంబంధాలు త్వరగా కుదర్చబడును. సంప్ర॥ కోట రవినాయుడు, మధువర్షిణి మ్యారేజెస్, కేశవస్వామిపేట, ఒంగోలు, సెల్: 9392192193.
AJO-241171

WANTED

HDFC లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా చేరండి ఆకర్షణీయమైన కమిషన్ మరియు జీతం, ప్రతినెల ఫారిన్ టూర్ లేదా క్యాష్ బహుమతులు. సంప్ర॥ 9381341066
AJO-233149

HOUSE FOR SALE

కొండపి (మం), కె.ఉప్పలపాడు గ్రామంలోని 6 సెంట్లలో కన్‌స్ట్రక్షన్ జరిగిన డూప్లెక్స్ హౌస్ అమ్మబడును. Price : 95 లక్షలు, నెగోషబుల్ కలదు, సెల్: 99590 53803.
AJO-241215

WANTED

ఒంగోలు మంగమూరు రోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూల్ నందు పనిచేయుటకు Un Married Graduate Male వార్డెన్ కావలెను. సంప్ర॥ 9849183364
AJO-503

PLOT FOR SALE

చీరాల LTD కాలనీ 148 చదరపు గజముల ప్లాటు, కళ్యాణ మండపం రోడ్డులో అమ్మకమునకు కలదు. పూర్తి వివరాల కొరకు సంప్రదించండి. మూర్తి ఫోన్: 9959226383
AJH-15552

VEHICLE FOR SALE

AP-27-TW-0457, Ashok Leyland Model 2013, AP-26-TF-6077 Ashok Leyland Model 2018, AP-39-UH-9239 Ashok Leyland Model 2022, AP-27-TZ-0669 Blazo 496 x 46 C Model 2017 వాహనము డి.15-11-2025న ఉదయం గం.10-30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్ సెల్: 99483 86165, 96402 22777
AJB-965

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిపిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు, పేపరు పంపిణీ విషయంలో సమస్యలు ఉన్నా సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి.
వివాహ, షష్ఠిపూర్తి, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 95053 05888, 97036 18694, 96525 55752, 99854 11483
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11071
గిద్దలూరు : 99859 21358



సంతనూతలపాడులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు



పోలీస్‌పెరడ్ మైదానంలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు, సిబ్బంది

స్వాతంత్ర్య సమర నినాదం 'వందేమాతరం'

- ఎస్పీ హర్షవర్ధన రాజు
- ఘనంగా వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలు

ఒంగోలు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భరత జాతిని ఒక్కటి చేసిన సమర నినాదం వందేమాతర గీతం అని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం అంటే తల్లీ నీకు నమస్కారం అని అర్థమన్నారు. మన మాతృభూమికి అంకితమైన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు , టి.విజయకృష్ణ, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు స్ఫూర్తి..

ఒంగోలు(రూరల్): వందేమాతరం గీతం దేశసమైక్యతకు నాంది అని, ప్రతి ఒక్కరూ ఆలపించాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఆ గేయాన్ని రచించిన



ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

బంకించంద్రచటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడు తూ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గీతం దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్, ఏపీఎం నాగేశ్వరరావు ఏపీవో విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

ఒంగోలు విద్య: నగరంలోని అన్ని విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్‌చక్రవర్తి, విభాగాధిపతి పి.శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రామపిచ్చయ్య, ఏవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ డీవీఆర్.మూర్తి, ప్రిన్సిపాల్ నిర్మలామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో ఉత్తేజాన్ని నింపిన వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మండల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం వందేమాతరం గేయం ఆలపించారు. కార్యక్రమంలో ఎంపిడీవో బి.రామాంజనేయులు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది వందేమాతరం. శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేఖ, ఎంఈవో 2 రామారావు, సాయిబాబా స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: వందేమాతరం గీతం 150 సంవత్సరాల సంబరాన్ని దొడ్డవరప్పాడులోని బీఏ అండ్‌కేఆర్ విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కాలేజీ హెచ్‌వోడీ కవిత, ప్రొఫెసర్ జీవీ.సుబ్బమ్మ, షమ్మీర్, సంతోష్‌కుమార్, రమా, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులను దూషించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో దళిత వర్గానికి చెందిన ఇద్దరు ఆఫీసు సబార్డినేటర్లను కులం పేరుతో దూషించడమే కాకుండా చేయి చేసుకున్న ఉన్నతాధికారి రవీంద్రనాథ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద ఏపీ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ వాణిజ్యపన్నులశాఖ ఆఫీసు సబార్డినేట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతరం స్ఫూర్తితో హక్కుల కోసం నినదిస్తూనే ఉంటామన్నారు. దళిత ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 14వతేదీన కార్యచరణ చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ల నాయకులు జాజుల నరసింగరావు, జె.సుజాతబాయి, తోట కిరణ్‌కుమార్, కరిచేటి సుధాకర్, ప్రసన్నకుమార్‌రెడ్డి, రవికుమార్, యూవీ.సుబ్బారావు, వై.కొండలరావు, ఎస్‌కే.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం





వెంకటకృష్ణారావు, చంద్రబాబులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఆచార్య రంగా కిసాన్‌సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అనేక సేవలు అందిస్తున్న కనపర్తి ఎత్తిపోతల పథకం, ఉప్పుగుండూరు సొసైటీలు ఉత్తమ పథకాలుగా ఎంపికయ్యాయి. దాంతో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, 20 సూత్రాల పథకం అమలు చైర్మన్ లంకా దినకర్ చేతుల మీదుగా కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, ఉప్పుగుండూరు సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబుకు అవార్డులను అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నడిపినేని శేషగిరి, గొల్లకారం వెంకట్రావు, పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, సొసైటీ సీఈవో నన్నపనేని కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొన్నలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్య అధికారి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి కృష్ణ చైతన్య మాట్లాడుతూ శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా విపరీతంగా పెరిగిపోవడమే క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఆహార అలవాట్లు, రేడియేషన్లు, ధూమపానం, ఊబకాయం, తదితరాలు క్యాన్సర్‌కు కారకాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్ర్కీనింగ్ చేయించుకోవాలని సూచించారు.

నాగులుప్పలపాడులో..



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

నాగులుప్పలపాడు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడులో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఓనారియల్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

- సమస్యల పరిష్కారం దిశగా కమిటీ అడుగులు
- అమరావతిలో ప్రత్యేక సమావేశం
- తమ డిమాండ్లను కమిటీ ముందుంచిన ఓనర్ల అసోసియేషన్



సమావేశంలో పాల్గొన్న గనులశాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ తన పనిని మొదలుపెట్టింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో కమిటీ తన తొలి సమావేశాన్ని నిర్వహించింది. కమిటీ చైర్మన్, మైన్స్ జేడీ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు. ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో చీమకుర్తి, బూదవాడ, మార్టూరు, చిలకలూరిపేట, పల్నాడు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ప్రధాన నాయకులు పాల్గొన్నారు. వీరు తమ డిమాండ్లను, గ్రానైట్ పరిశ్రమ మనుగడకు తీసుకోవాల్సిన నిర్ణయాలను కమిటీ ముందు ఉంచారు. ట్రాన్సిట్ ఫారంను రద్దు చేయాలని, శ్లాబ్ సిస్టంలో భాగంగా కొనుగోలు చేసిన క్యూబిక్ మీటర్ ముడిరాయిపై ఇస్తున్న అనుమతిని 350 అడుగుల నుంచి 450కి పెంచాలని కోరారు. మైనింగ్ రాయల్టీని ప్రభుత్వం నిర్ధేశించిన మేరకే చెల్లిస్తామని, అదనంగా చెల్లించలేమని తెలిపారు. ఈసీ క్వాంటిటీని పరిశీలించాలని కోరారు. ఈ డిమాండ్లపై కమిటీ సభ్యులు స్పందిస్తూ తామే స్వయంగా గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించి తగు నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. సమావేశంలో చీమకుర్తి ప్రాంతం నుంచి అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, ఇంటూరి భవానీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. కమిటీ తన విచారణను ఈనెల 15వ తేదీలోపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ఈ నివేదిక పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గ్రానైట్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనుంది.

18న సామాజిక న్యాయంపై ధర్నాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదలోనే కాకుండా చట్టసభల్లో, అన్ని రంగాల్లో అందరికీ వాటా కావాలంటూ ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ధర్నాలు, సదస్సులను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి కేవీ.కృష్ణగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరగాలన్నారు. కులాల్లోని జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు చట్టసభల్లో, సంపదలో, అన్ని రంగాల్లో వారి వాటా వారికి దక్కాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం దేశ సంపదను, పరిశ్రమలను, సహజసంపదను కొద్ది మంది కార్పొరేటర్ల చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. దీంతో పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సయ్యద్‌యాసిన్, నల్లూరి మురళి, శ్రీరామ్ శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్. రామకృష్ణ, వి.హనుమారెడ్డి, ఎస్‌డీ.మౌలాలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





మొక్కలను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, మొక్కను నాటుతున్న పారిశుధ్య సిబ్బంది



ఉత్సాహంగా గ్రీన్ ఒంగోలు!

ఒంగోలు నగరంలో శుక్రవారం స్వచ్ఛఒంగోలు-గ్రీన్ ఒంగోలు పేరుతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఒక్కొక్క మొక్కను నాటి జియోట్యాగింగ్ చేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ మొక్కలు పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)





నగరంలో రోడ్ల వెంట మొక్కలను నాటుతున్న కళాశాలల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

టంగుటూరు(కొండపి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అన్నపరెడ్డి చందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. డిస్కస్‌త్రో ఈవెంట్ మొదటి స్థానాన్ని సాధించిందని పీడీ అరుణ తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

నేడు రామచంద్రయాదవ్ రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత చైతన్య యువ జన పార్టీ జాతీయ అధ్యక్షుడు బొడే రామచంద్రయాదవ్ శనివారం సాయంత్రం ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బండ్లమూడి ఎస్సీ బాధితులను పరామర్శిస్తారని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులను పరామర్శించి ఘటన పూర్వపరాలను అడిగి తెలుసుకుంటారన్నారు. జిల్లాలోని అభిమానులు, బీజేవై పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

10న ఒంగోలులోనే 'మీ కోసం'

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక (మీకోసం) ఈనెల 10వతేదీన ఒంగోలులోనే జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న మోటార్‌సైకిల్ అతి వేగంగా మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొనగా చిలుకలూరిపేటకు చెందిన ఆర్.ప్రవీణ్‌కుమార్, ఆర్.స్టీఫెన్‌లకు గాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని ఒంగోలుకు తరలించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తివేత

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలలో కురిసి వర్షాల వల్ల శుక్రవారం గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి 6600 క్యూసెక్కులు నీరు వచ్చింది. దీంతో నాలుగు గేట్లు ఎత్తి 6700 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రాజెక్టు లెవెల్‌ను 24 మీటర్ల వద్ద స్థిరీకరణ చేశామని, ప్రాజెక్టులో 3.3 టీఎంసీల నీ టిని నిల్వ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కొత్తపట్నం ఏపీఎంగా ప్రసాదరావు

కొత్తపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండల వెలుగు ఏపీఎంగా బలగాని ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఒంగోలులో పనిచేస్తూ కొత్తపట్నం బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు కొత్తపట్నం ఏపీఎంగా పనిచేసిన విజయకుమారి ఒంగోలుకు బదిలీ చేశారు.

క్యూఆర్‌కోడ్ ద్వారా పన్నులను చెల్లించాలి

జరుగుమల్లి (కొండపి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జరుగుమల్లి మండలం చిరుకూరుపాడు గ్రామంలో స్వామిత్వ, ఇంటి పన్ను వసూలుపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ పేమెంట్ విధానంతో ఇంటి పన్నులు చెల్లించేలా గ్రామ సచివాలయం సిబ్బందికి సూచించారు.

స్కూల్ బస్సుల తనిఖీ



బస్సును తనిఖీ చేస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్సై అనుక్ శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డ్రైవర్, క్లీనర్ ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని స్కూల్ బస్సులకు సంబంధించిన ఫిట్నెస్ సర్టిఫికెట్, ఆర్సీ ఇన్సూరెన్స్ అన్ని సర్టిఫికెట్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని డ్రైవర్లకు తెలిపారు. విద్యార్థులను స్కూల్ నుంచి ఇంటి వరకు జాగ్రత్తగా పంపించవలసిన బాధ్యత డ్రైవర్‌కు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ సేవ కార్యక్రమాలపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టంగుటూరు(కొండపి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతో దోహదపడిందని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి తన్నీరు బాలాజీ అన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చుండూరు చలపతిరావు మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్ వల్ల విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందని, అందుకోసం స్కూలులో ప్రభుత్వం యూనిట్లు నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో జె.అంజయ్య, ఉపాధ్యాయులు చదలవాడ శ్రీనివాసులు, లక్ష్మీసునంద, సుస్మిత, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రధానంగా దృష్టిసారించాలని ఎంపీడీవో డి.సురేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం సంతనూతలపాడు, చంద్రపాలెం గ్రామాల్లో ఇంటింటి చెత్తసేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సైడు కాలువల్లో చెత్త అడ్డుపడి పారుదల అవరోధాలను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. మంచినీటిని క్లోరినేషన్ చేయించి కుళాయిల ద్వారా విడుదల చేయాలన్నారు. రాత్రివేళల్లో ఫాగింగ్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో చంద్రపాలెం ఈవో మౌనిక, సంతనూతలపాడు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలుచోట్ల కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ఆఫీస్, సీవీఎన్ రీడింగ్ రూమ్, గాంధీరోడ్ ఏనుగుచెట్టు, మాతశిశువైద్యాశాల, కోర్టు సెంటర్, జమ్మిచెట్టు బజార్ తదితర ప్రాంతాల్లో కరెంటు నిలిపివేయునున్నట్లు డీఈ రంగారావు తెలిపారు. అదేవిధంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 వరకు మంగమూరురోడ్డు, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్, మర్రిచెట్లకాలనీ, చంద్రయ్య నగర్, 60 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఇక ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొప్పోలు సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లూరు, కొప్పోలు, దశరాజుపల్లె, గుత్తికొండవారి పాలెంలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ డీఈ శ్రీకాంత్ వెల్లడించారు.

జెండా ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 60అడుగుల రోడ్డులో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు జి.రమేష్ మాట్లాడుతూ 1917లో రష్యాలో విప్లవం వచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితో ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పార్టీలు ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వీరస్వామి, వి.మాలకొండయ్య, భీష్మాచారి, జి.ఆదిలక్ష్మి, టి.భక్తసింగ్‌రాజు, ఎం.శ్రీనివాసులు, బాలకృష్ణ, పాపని సుబ్బారావు, ఎం.ఆదినారాయణ, ఖాసీం, ఎస్‌కే.సుభాని, టి.వీరయ్య, డి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం..

పశ్చిమ ప్రకాశంలో వాడవాడలా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి గేయం ఆలాపన

గీత రచయిత బంకించంద్ర ఛటర్జీకి పలువురు నివాళి.. పలుచోట్ల జాతీయ పతాకంతో ర్యాలీలు



కంభంలో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు, పోలీసులు, అధికారులు

గిద్దలూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. తొలుత ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి, ఎంఈవో నాగభూషణ రెడ్డి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మున్సిపల్ కౌన్సిలర్ లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి జిల్లెల్ల సంపత్‌కుమార్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బాలూనాయక్ పాల్గొన్నారు.

గీతం ఆలపించిన అధికారులు

తర్లుపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతరచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా స్థానిక జడ్పీ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు 150 అడుగుల జాతీయ పతాకంతో ప్రదర్శన చేశారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేకే కిషోర్‌కుమార్, ఎంపీడీవో అన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

మార్కాపురంలో...

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం వందేమాతర గీతం ఆలపించారు. స్థానిక గడియార స్థంభం వద్ద జాతీయ పతాకం చేతపట్టి వందేమాతర గీతం ఆలపించారు. మానవత సంస్థ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలో వందేమాతర గీతం ఆలపించారు.



పొదిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పొదిలిలో...

పొదిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దబస్టాండ్ సెంటర్లో వందేమాతరం గీతం ఆలాపనను వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, నాయకులు మాగులూరి రామయ్య, సయ్యద్ ఖాదర్‌బాషా, నూరెడ్డి శ్రీనివాసరెడ్డి, సోమిశెట్టి శ్రీదేవి, మొహరున్నీసా, రఫీ, నాగేశ్వరరావు, ఆకుపాటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్‌స్టేషన్, నలంద హైస్కూల్, ఆదిత్య డీఈడీ కళాశాల, బ్రిలియంట్ హైస్కూల్‌తో పాటు పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు.మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి, కొలుకుల, మురారిపల్లిలోనూ నిర్వహించారు.

దేశం స్వాతంత్రోద్యమంలో వందేమాతరం గేయం దోహదం

ఎర్రగొండపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్రోద్యమ పోరాటం ఉవ్వెత్తున ఎగిసేలా వందేమాతరం గేయం ప్రోత్సాహం ఇచ్చిందని ఎంఈవో ఆంజనేయులు చెప్పారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం 150వ వందేమాతరం వార్షికోత్సవంలో పాల్గొని వందేమాతరం దేశభక్తి గేయం విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాశిం, ఎంఈవో 2 మల్లునాయక్, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య, ఉపాధ్యాయులు సుబ్బాయమ్మ, శివయ్య, పీడీ త్రినాథ్ పాల్గొన్నారు.

కొమరోలులో...

కొమరోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామ పంచాయతీ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు స్వతంత్ర సమరోద్యమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యం మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని ఆలపించినప్పుడు ప్రతి భారతీయుడు ఉత్తేజంతో పొంగిపోతాడన్నారు. వందేమాతరం గీతాలను ఆలపించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి దేవరశెట్టి బ్రహ్మయ్య, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



మార్కాపురంలో వందేమాతరం పాడుతున్న మానవత స్వచ్ఛంద సేవా సభ్యులు

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

మార్కాపురం ఆర్టీసీ డిపోలో డార్మిటరీని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన డార్మిటరీని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు డిపోలో ప్రయాణికులకు విశ్రాంతి తీసుకోవాడానికి సరైన సదుపాయాలు లేవన్నారు. గత ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యం కోసం ఎలాంటి పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, నేతలు తాళ్లపల్లి సత్యనారాయణ, పఠాన్ ఇబ్రహీంఖాన్, కాకర్ల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య, కొప్పుల శ్రీనివాసులు, బాబీ పాల్గొన్నారు.



డార్మిటరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర చెప్పారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా పట్టంలోని సీహెచ్‌సీ సెంటర్ నుంచి చిన్నబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ పలురకాలుగా, పలు రూపాల్లో వస్తుందని చెప్పారు. ఏటా చెకప్ చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలను యోనిముఖ ద్వారం, రుతుక్రమం సరిగా లేకపోయినా, బహిస్టు అయిన తరువాత ఎప్పుడూ వాసనతో కూడిన బ్లీడింగ్ ఉన్న వారు తమ దగ్గరలోని ఆశావర్కర్లకు తెలియజేయాలన్నారు. నోటిక్యాన్సర్‌లో చిగుళ్లవాపు, రక్తం కారవటం, దవడలో ఎరుపు లేక తెల్లటి మచ్చలు ఉండటం, నోటిలో వాసన ఉన్నవాళ్లు తప్పకుండా పరీక్షకు వెళ్లాలని చెప్పారు. అదేవిధంగా రొమ్ము క్యాన్సర్, చంకలో గడ్డలు, చనుమొనల నుంచి నీరు కారడం వంటి లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పకుండా స్కానింగ్ తీయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓయూ క్రిష్ణయ్య, సూపర్‌వైజర్ మోరీనా, శ్రీనివాసరెడ్డి, హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



క్యాన్సర్ వ్యాధిపె అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాచర్లలో...

రాచర్ల, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ ముత్యాల ప్రసాద్ చెప్పారు.

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా రాచర్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సీహెచ్‌వో రామాంజనేయులు, ఏఎన్‌ఎం లక్ష్మీ పాల్గొన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్‌కే ఇస్మాయిల్ షరీఫ్ చెప్పారు. స్థానిక సబ్‌జైలును ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఖైదీలకు అందించే ఆహార పదార్థాలతోపాటు వసతులను పరిశీలించారు. సమస్యల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకొని జీవితాలను బాగుచేసుకోవాలన్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థికస్థోమత లేకుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరమణ, న్యాయసహాయ న్యాయవాది అన్వర్‌బేగ్‌లు పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

గిద్దలూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్‌జైలును జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీంషరీఫ్ తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాది పోలయ్య, పారాలీగల్ వాలంటర్ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



జైలులో ఆహర పదార్థాలను తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి ఇబ్రహీంషరీఫ్

నిర్వాసితులకు రూ.20లక్షలు పరిహారం అందించాలి

మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్ద దోర్నాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ సందర్శనలో భాగంగా శుక్రవారం దోర్నాల వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సీపీఎం బృందం వినతి పత్రం అందజేసింది. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు డీ సోమయ్య, నాయకులు దొడ్డా సుబ్బారెడ్డి, తిరుపతి రెడ్డి, కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నాగయ్య ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి రూ.10,50,000 నుంచి రూ.20లక్షలకు పెంచి పరిహారం అందజేయాలని కోరారు. అంతేగాక ఆ కుటుంబాల్లో చదువుకున్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని, పునరావాస కేంద్రాలు అన్ని వసతులతో త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఒక్కోటి ప్రాధాన్యత పద్ధతిలో అవసరమైన రీతిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్టీసీ బస్టాండు నిర్మించాలి

దిగువ శ్రీశైలంగా పేరొందిన దోర్నాలలో ఆర్టీసీ బస్టాండు నిర్మించాలని మండలానికి చెందిన పలువురు నాయకులు మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి దక్షిణ కాశీగా వెలుగొందుతున్న శ్రీశైలానికి యాత్రికులు నిత్యం వస్తుంటారని, అంతేగాక విజయవాడ, బెంగళూరు, పుటపర్తి, మహానంది వంటి నగరాలకు వందల సంఖ్యల్లో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని, బస్టాండు లేక వృద్ధులు, పిల్లలు, మహిళలు వాన, ఎండలకు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మార్కాపురం విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.మహేష్, ఎం.అజయ్‌లు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఒంగోలులోని పీవీఆర్ పాఠశాలలో జరిగిన స్కూల్ అండర్ 14 విభాగ పోటీల్లో సత్తాచాటారని వివరించారు. వి.మహేష్ 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, ఎం.అజయ్ 400, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి ఎంపికయ్యారని తెలిపారు. వీరు శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.దామోదర్ రెడ్డి, శ్యామల దేవీ, కే ఓబులేష్‌లను అభినందించారు.

విద్యుత్తు శాఖ సీఎండీని కలిసిన నాయకులు

పెద్ద దోర్నాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు శాఖ సీఎండి పుల్లారెడ్డిని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దోర్నాలలో లోఓల్టేజి సమస్య ఉందని, మరో సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని, దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు, కరెంటు లైను తీగలు పాతవి కావడంతో తరచూ తెగిపోతున్నాయని, కిందకు వేలాడుతున్నాయని నూతనంగా కొత్త స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఏఈ భీమానాయక్, ఎల్ఐ ఉస్మాన్‌బాషా, టీడీపీ నేత వీరారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రి, శ్రీనివాస్‌లకు సన్మానం

మార్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బీవీఎస్ శాస్త్రి, డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన వి.శ్రీనివాస్‌లకు శుక్రవారం బ్రాహ్మణ సంఘాల నాయకులు సన్మానం చేశారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోపాలుని హరిహరరావు, పండిత పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్రకుమార్, జీఎల్ రమేష్‌బాబు, కేశవస్వామి, డీవీ రమణ, బొద్దుపల్లి కృష్ణ, సోమయాజుల హరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 8వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా నంద్యాల హైవే రోడ్డు, ఒంగోలు హైవే రోడ్డు మొత్తం, బ్రిటన్ రోడ్డు, క్లబ్ రోడ్డు, రాజానగర్, వెటర్నరీ ఆసుపత్రి, పోలీసుస్టేషన్ ఏరియా, కుమ్మరాంకట్ట, గాంధీబొమ్మ సెంటర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

14న వినియోగదారుల సంఘ సమావేశం

గిద్దలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు వినియోగదారుల పరిరక్షణ సేవా మండలి సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 11గంటలకు సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు ఈ సంఘం అధ్యక్షుడు వి.వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని, ప్రజలందరూ హాజరుకావాలని కోరారు.

రాజానగర్‌లో కలుషిత నీరు సరఫరా

గిద్దలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజానగర్‌లో ప్రజలు కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. రాజానగర్‌లోని కొన్ని ప్రాంతాలలో మున్సిపల్ కొళాయిల ద్వారా కలుషిత నీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఆ నీటిని తాగి అనారోగ్యానికి గురవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లు బాగు చేసి కలుషిత నీరు కొళాయిలలో రాకుండా చూడాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కుంకుమార్చనలో మహిళా భక్తులు

గిద్దలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీఆర్‌కాలనీలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవి కుంకుమార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈనెల 22వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు విశ్వశాంతి కోసం శ్రీమహాలక్ష్మీదేవి 32వ కుంకుమార్చన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని దేవస్థాన కమిటీ అధ్యక్షులు కె.కొండయ్య, కార్యదర్శి జి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు.

నాణ్యమైన పొగనారే కీలకం

పొదిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగు చేసే ప్రతి రైతు నాణ్యమైన నారును ఎంచుకోవాలని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ చెప్పారు. ఇటీవల తుఫాన్ ధాటికి పొగ నారుమళ్లలో నీటినిల్వలు ఉన్నందున మాగుడు, కుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటిని అరికట్టేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్, ప్లాంటామైసిన్ మందులను కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఆ తర్వాత అమిష్టర్ 10 మి.లీ. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. 25 రోజులుదాటితే మొటాలాక్సిల్ 20 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచాకారీ చేయాలన్నారు.

మొక్కజొన్న తోటలో బాలుడి శవం

అటవీ

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మృతదేహాన్ని పాతిపెట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

పెద్దదోర్నాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న తోటలో అనుమానాస్పదస్థితిలో చెంచు గిరిజన బాలుడి చనిపోయి ఉన్నాడు. ఈ సంఘటన మండలంలోని చిలకచెర్ల గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. ఆ మృతదేహం నందిగూడేనికి చెందిన అర్తి నాగన్న(16)గా గుర్తించారు. ఎస్సై మహేశ్ తెలిపిన కథనం ప్రకారం... చిలకచెర్ల గ్రామంలో మొక్కజొన్న తోటలో గుర్తు తెలియని శవం ఉందని సమచారం వచ్చింది. సంఘటనా స్థలానికి వెళ్లి నిశితంగా పరిశీలించారు. తహసీల్దారు అశోక్ కుమార్‌రెడ్డి సమక్షంలో శవాన్ని భూమి నుంచి బయటకు తీయగా నందిగూడెంకు చెందిన గిరిజన బాలుడిగా గుర్తించామన్నారు.తదనంతరం పంచనామా చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

రాచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తికి జైలు శిక్ష పడింది. ఈ సంఘటన శుక్రవారం రాచర్ల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పోతంశెట్టిపల్లికి చెందిన దండూరి సుబ్బయ్యపై కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన భాస్కర్ తన పొలం వద్ద ఉన్న కుంటలో దండూరి సుబ్బయ్యకు చెందిన గేదెలు నీళ్లు తాగాయని 2017లో గొడ్డలితో దాడి చేశాడు. దీంతో సుబ్బయ్య రాచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నాగశ్రీను హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుపై శుక్రవారం మార్కాపురం కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి దేవేంద్రారెడ్డి నెలరోజులు జైలుశిక్ష లేదా రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

పులి దాడిలో ఆవులు మృతి.. పరిహారం అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న రేంజర్

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల, గంజివారిపల్లి సెక్షన్ పరిధిలో జూన్, జూలై నెలల్లో పులి దాడిలో ఆవులు మృతి చెందాయి. ఆవుల యజమానులకు సంబంధించి నష్టపరిహారాన్ని ఫారెస్టు అధికారులు విడుదల చేశారు. వాటిని గంజివారిపల్లి ఇంచార్జీ రేంజ్ అధికారిని ఏ ప్రసన్నజ్యోతి కార్యాలయంలో బాధితులకు చెక్కులను అందజేశారు. ఆవుల యజమానులైన కేతావత్ ననికేనాయక్ రూ.30వేలు, కుడముల అంకన్నకు రూ.35వేల చెక్కులను పంపిణీ చేశారు. పాలుట్ల సెక్షన్ అధికారి యాసీహెచ్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

పలు రహదారుల్లో వాహన తనిఖీలు



జాతీయ రహదారిపై తనిఖీ చేస్తున్న పోలీసులు

గిద్దలూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో, అలాగే కడప-విజయవాడ రాష్ట్రీయరహదారిలో విడతల వారీగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహన సంబంధిత ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర పత్రాలు పరిశీలించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన వివరాలు, మలుపుల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డ్రైవర్లకు వివరించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, మీ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని సూచించారు. తనిఖీలలో అర్బన్, రూరల్ సీఐలు సురేష్, రామకోటయ్య పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అంకమ్మరావు

మార్కాపురం రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమ్మనపల్లి వద్ద ఆటో, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మోటార్ సైకిల్‌పై ఉన్న ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపిన సమాచారం ప్రకారం... గొట్టిపడియ గ్రామం నుంచి ఆటో మార్కాపురం వస్తుంది. అదే సమయంలో మార్కాపురం నుంచి సుంకేసుల వెళుతున్న మోటార్ సైకిల్ జమ్మనపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సుంకేసులు గ్రామానికి చెందిన తేజ, బన్నీలకు గాయాలయ్యాయి. ప్రమాద ప్రదేశాన్ని రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న పీజీఎన్ఎఫ్ సంస్థ సభ్యులు

తర్లుపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు పీజీఎన్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు. మొత్తం 48 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాసుల రెడ్డి, పీజీఎన్ఎఫ్ సంస్థ సభ్యులు డాక్టర్ సుధాకర్, సీఏ ప్రసాద్, తేళ్ల అరుణ, హెచ్‌ఎం వై.శీనివాసరావు, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బాయ్స్, స్కౌట్స్ వార్షికోత్సవం

ఎర్రగొండపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ప్రభుత్వపాఠశాలలో బాయ్స్&స్కౌట్స్ 75వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఆంజనేయులు బాయ్స్&స్కౌట్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సోమశేఖర్, పీడీ త్రినాధ్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి



పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కురిచేడు యోగయ్య స్వామి ఆలయంలో శుక్రవారం సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమంలం ఘనంగా జరిగింది. ఆలయంలో భక్తులు పూజలుచేసి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం భక్తిరస ప్రధానమైన నాటకాలు ప్రదర్శించారు. ఎస్ఐ శివ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

కురిచేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని ఎంపీడీవో సత్యప్రసాద్ సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి సూచనల ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీల్లో గృహ వినియోగదారులు స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నులు చెల్లించాలన్నారు.

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాలలో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి స్వర్ణ పంచాయతీ క్యూఆర్ కోడ్ ద్వారా పన్ను చెల్లించాలన్నారు. ఇంటి పన్నులు చెల్లించని వారికి ప్రభుత్వ రాయితీలు అందవని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల దరిచేరాలి

పామూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు దరిచేరేలా కేఎస్ఎస్ సభ్యులు ప్రధానపాత్ర వహించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు.

శుక్రవారం స్థానిక బాలేరంతుసాహెబ్ గృహంలో 267, 268 బూత్‌ల పరిధిలోని కుటుంబ సాధికారిక సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సయ్యద్ అమీర్‌బాబు, షేక్ హజీగౌస్, ఇర్రి కోటిరెడ్డి, జి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

పీసీపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పీసీపల్లిలో డాక్టర్ యషిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక వైద్యశాల నుంచి బ్యాంకు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ యషిత మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి సరైన వైద్యం పొందితే క్యాన్సర్‌ను జయించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, సీహెచ్‌వో భాగ్యవేణి, పీహెచ్ఎన్ సంధ్యారాణి, హెచ్‌వీ సూపర్‌వైజర్ రేణుక, ఎంఎల్‌హెచ్‌పీ మణి, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

పామూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని ఎంఈవో కె .కరుణకుమారి అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో నైతిక విలువల ప్రాధాన్యత గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన పదిమంది విద్యార్థినులకు రూ.ఐదు వందల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎం.నారాయణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దర్శిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

దర్శి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులోగల సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డు, తూర్పుచౌటపాలెం రోడ్డు, టీచర్స్ కాలనీ, శివరాజ్‌నగర్ ప్రాంతాల్లో శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సచన్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కనిగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఏర్పడే సమస్యల పరిష్కారం ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ కృషిచేస్తుందని యూనియన్ నాయకులు పువ్వాడ తిరుపతయ్య అన్నారు. స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయంలో శుక్రవారం జోనల్ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీలో జీఎస్టీ రద్దు, తదితర సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషిచేసి విజయం సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.అనూక్, కె.సునీల్, రాయళ్ళ సుబ్బరాయుడు, ఎస్.ప్రభాకర్, వేల్పుల తిరుపతయ్య, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిలోనే కార్యాలయ ప్రాంగణాలు

- వర్షాలకు జలమయమవుతున్న వైనం
- దెబ్బతింటున్న విలువైన రికార్డులు, ఫర్నిచర్లు

దర్శి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తరచూ పలు ప్రభుత్వ కార్యాలయాలు జలమయమవుతున్నాయి. భారీగా నీరుచేరి రోజులు తరబడి నిల్వ ఉండటంతో రికార్డులు, విలువైన సామాన్లు కూడా దెబ్బతింటున్నాయి. ఎన్ఎస్‌పీ దర్శి సబ్ డివిజన్-2 కార్యాలయం కొద్దిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మూడు అడుగుల మేర కార్యాలయం చుట్టూ నీరు చేరింది. కార్యాలయం లోపలకు కూడా నీరు వెళ్లి కుర్చీలు, రికార్డులు ర్యాకులు కూడా మునిగాయి. వర్షపునీరు బయటకు వెళ్లే వీలులేక రెండురోజుల పాటు అలాగే నీరు నిల్వ ఉంది.



దర్శి ఆర్అండ్‌బీ అతిథి గృహం చుట్టూ నిలబడిఉన్న నీరు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం చుట్టూ నిల్వఉన్న నీరు

స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం చుట్టూ కుంటలా నీరు ఇప్పటికీ నిల్వ ఉండి ఎగువ నుంచి వచ్చే కాలువను కొంతమంది ఆక్రమించి కట్టడాలు నిర్మించటంతో నీరు కిందకు వెళ్లే వీలులేక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం చుట్టూ చేరుతుంది. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో నేటికీ కుంటలా నీరు నిల్వ ఉంది. కార్యాలయం ఆవరణ అంతా గుంతలు ఉండటంతో నీరు బయటకు వెళ్లే వీలులేక అలాగే రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి.

దర్శి పట్టణానికి ఇరువైపుల ఉన్న జోమ్‌కాలువ, కాటేరు వాగు ఆక్రమణలకు గురై నీరు కిందకు వెళ్లే వీలులేకపోవటంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో లోతట్టు ప్రాంతాలకు చేరిన నీరు బయటకు వెళ్లటం లేదు. రోజులతరబడి కార్యాలయాల చుట్టూ నీరు నిల్వ చేరినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. నిల్వ ఉన్న నీరు మురికినీరుగా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

- నియామకంలో పాలకుల తాత్సారం
- గాడితప్పుతున్న పాలన



తాళ్లూరు గ్రామ సచివాలయం

తాళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 9చోట్ల కార్యదర్శులు లేక పాలన కుంటుపడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు బదిలీలపై వెళ్లారు. వారిస్థానంలో నియామకాలు జరగలేదు. అలాగే, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కొందరు, పదోన్నతులపై మరికొందరు బదిలీలపై వెళ్లటంతో మండలంలో కార్యదర్శుల కొరత ఏర్పడింది. దీంతో ఒక్కో పంచాయతీకి ముగ్గురు కార్యదర్శులు చొప్పున ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు.

మండలంలో 16 గ్రామ పంచాయతీలకు గాను 14 గ్రామసచివాలయాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం బెల్లంకొండవారిపాలెం గ్రామకార్యదర్శి డి.శ్రీవల్లి రామభద్రాపురం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా, దోసకాయలపాడు కార్యదర్శి కె.మెలకయ్య మన్నేపల్లి ఇన్‌చార్జ్‌గా, తూర్పుగంగవరం గ్రామకార్యదర్శి డి.నాగమల్లేశ్వరి బొద్దికూరపాడు, కొర్రపాటివారిపాలెం ఇన్‌చార్జ్‌గా, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. అలాగే, మాధవరం గ్రామకార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు తురకపాలెం, లక్కవరం గ్రామాలకు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా, వెలుగువారిపాలెం కార్యదర్శి వి.సుబ్బారెడ్డి నాగంబొట్లపాలెం ఇన్‌చార్జ్‌గా, విఠలాపురం కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం తాళ్లూరు, శివరాంపురం గ్రామాలకు ఇన్‌చార్జ్ గా విధులు నిర్వహిస్తున్నారు. మల్కాపురం కార్యదర్శికి మాత్రమే ఇన్‌చార్జ్ బాధ్యతలు లేవు.

కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు వివిధరకాల సర్వేలు నిర్వహిస్తుంది. అయితే, పంచాయతీ కార్యదర్శుల కొరతతో సర్వేలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి సర్వేలో గ్రామపంచాయతీ కార్యదర్శి లాగిన్ కావాలి. దీంతో కార్యదర్శులు ఆ పంచాయతీలకు వెళ్లలేకపోవటంతో సర్వేలు పూర్తి చేయలేకపోతున్నారు. గత 8 నెలలుగా కార్యదర్శులు కొరతతో ఆయా గ్రామాల్లో పాలన గాడి తప్పుతుంది. దీనికితోడు సర్వేలు సకాలంతో పూర్తికాక జిల్లాలో వెనుకబడింది. గ్రామాల్లో రాజకీయ జోక్యాలు మితిమీరి పోతుండటంతో ఇన్‌చార్జ్ కార్యదర్శులు ఆయా గ్రామాలకు సక్రమంగా వెళ్లటంలేదు. కొన్నిగ్రామాల్లో పారిశుధ్య పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో ఆడిట్ లేదు.

ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పంచాయతీలకు పూర్తిస్థాయిలో గ్రామకార్యదర్శుల నియామకాలకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దేశ ఐక్యతను చాటిన

వందేమాతరం గీతం

- డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్



కనిగిరిలో మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం దేశ ఔన్నత్యాన్ని చాటుతుందని డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. వందేమాతరం గేయం ఆలాపన మొదలై 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో విద్యార్థులతో కలసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం ఒక గీతం కాదని, అది భారతస్వాతంత్ర్య సమరానికి ప్రేరణ ఇచ్చిన గొప్ప జాతీయ గీతమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించి వందనం చేశారు. కార్యక్రమంలో సీఐ ఖజావలి, ఎస్ఐలు టి.శ్రీరాం, మాధవరావు, ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, స్థానిక మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ డిపో, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.



పామూరులో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, పోలీసులు

దొనకొండ: వందేమాతర గీతం స్వాతంత్ర పోరాటానికి స్ఫూర్తి గీతమని స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్(నాని) పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జాతీయ జెండాలను చేతపట్టుకొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, కవిత, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: దేశ ఐక్యతను చాటిన వందేమాతరం గీతాన్ని ప్రతిఒక్కరూ ఆలపించాలని ఎంపీడీవో పి.అజిత, ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. వందేమాతరం గీతానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఎస్.మల్లి కార్జునరావు సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కాలేషావలి, పంచాయతీ కార్యదర్శి షహనాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: వందేమాత గేయానికి సముచిత గౌరవం దక్కిందని ఎస్ఐ శివ అన్నారు. స్థానిక శ్రీ రాఘవేంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలసి ఆయన పోలీస్ స్టేషన్‌లో వందేమాత గేయం ఆలపించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసిన అధికారులు వందేమాత గేయం గురించి వివరించారు. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

పామూరు: స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ స్ఫూర్తి నింపింది వందేమాతరం గీతమని సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతం గీతలాపన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో విద్యార్థులతో కలిసి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కిశోర్‌బాబు గీతలాపన చేసారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలోనూ జాతీయ జెండాతో ప్రదర్శన చేసి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ హుసేన్, ఎంపీడీవో విప్రతాప్‌రెడ్డి, ఎంఈవో జె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: వందేమాతర గేయాన్ని రచించి ఆలపించి నేటికి 150 సంవత్సరాలు పూర్తయిందని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు

తాళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ హైమావతి హెచ్చరించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఈఈ పి.హైమావతి, దర్శి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసుల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ తనిఖీల్లో నలుగురు వినియోగదారులు అదనపు లోడ్ వాడగా అపరాధ రుసుం రూ.1560 విధించినట్లు చెప్పారు. అనుమతి తీసుకున్న కేటగిరి కాకుండా ఇతర కేటగిరి విద్యుత్ వాడుతున్న ఓవినియోగదారునికి అపరాధ రుసుం రూ.మూడు వేలు విధించినట్లు చెప్పారు. మీటర్లు లేకుండా చౌర్యానికి పాల్పడుతున్న 33 మందికి అపరాధ రుసుం రూ.లక్షా 56 వేలు విధించారన్నారు. విద్యుత్ శాఖ తనిఖీల్లో అక్రమాలకు పాల్పడుతున్న వినియోగదారుల నుంచి రూ.2,41,600ల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ హైమావతి తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఎగ్జికుటివ్ ఇంజనీర్ పి.రవికుమార్, డివిజనల్ పరిధిలోని డీఈఈలు, ఏఈఈలు, జేఈలు, ఎల్ఐలు, ఎల్ఎంలు, 40 మంది అధికారులు, 80 మంది సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ ఈఈ హైమావతి



ఆచార్య ఎన్‌జీ రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఘనంగా ఎన్జీ రంగా జయంతి

దర్శి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి వేడుకలను స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్యారాణి, శాస్త్రవేత్తలు ఆచార్య ఎన్‌జీ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం ఎన్‌జీ రంగా జీవితాంతం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు పరిశోధనా స్థానాలన్నీ ఆయన పేరుతో నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్, రీసర్చ్ అసోసియేట్ డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

దొనకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ ప్రాథమిక కంటి ఆస్పత్రి రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఆదవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టెక్నీషియన్ దుగ్గెంపూడి శ్రీనివాసులు తెలిపారు. ఒంగోలుకు చెందిన స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

రోడ్డుపై గుంతలు.. తప్పని పాట్లు



చీమకుర్తి రోడ్డులో సబ్‌స్టేషన్ వద్ద పడిన గుంత

తాళ్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పుగంగవరం నుంచి చీమకుర్తి వెళ్లే ఆర్అండ్‌బీ మార్గంలో 133/32 విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద మోకాటి లోతు గుంతలు పడ్డాయి. హైవేరోడ్డు నిర్మాణానికి టిప్పర్లతో మట్టితోలుతున్నారు. టిప్పర్ల రాకపోకలు ఎక్కువగా సాగుతుండటంతో తూర్పుగంగవరం-చీమకుర్తి రోడ్డు దెబ్బతింది. సబ్‌స్టేషన్ వద్ద రెండు పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దగ్గరికి వచ్చేవరకు గుంతలు కనిపించకపోవడంతో వాహనచోదకులు షడన్‌గా బ్రేకులు వేయటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ్లలలో గుంతలు కన్పించక గుంతల్లో పడి పలువురు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి స్థలం కేటాయించాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో వృద్ధ, అనాథ ఆశ్రమం నిర్మాణానికి పంచాయతీ స్థలంతోపాటు అనుమతులు మంజూరుచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రాజేష్ కోరారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డిలను జీవీఆర్ ట్రస్ట్ తరుపున ఆయన కలిశారు. గ్రామ పంచాయతి పరిధిలోని సర్వే నెంబర్ 147లో 2.87 ఎకరాల స్థలం ఉందని తెలిపారు. దానిని కేటాయిస్తే జీవీఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ సహకారంతో ఆశ్రమం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసవర్మ, గ్రంధి హేమసుందరం, పాలకొల్లు వెంకటరెడ్డి, మన్నేపల్లి శ్రీను, మహేంద్ర, రేనాటి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు ఇండ్ల సత్యం, జనసేన నాయకుడు తోట వెంకట్రావు పాల్గొన్నారు.

ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బయట తినే ఆహారం పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కనిగిరిలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. దీంతో వాటి ప్రభావం మనిషి జీవన ప్రమాణాలపైన, ఆరోగ్యంపై పడుతున్నాయన్నారు. పూర్వంలో ఇంటి ఆహారంతో ఎంతో ఆరోగ్యంగా ఎక్కువ ఏళ్ళు జీవించేవారన్నారు. నేడు పరస్థితి భిన్నంగా తయారైందన్నారు. ఎక్కువమంది బయట లభించే తినుబండారాలపై మక్కువతో అనారోగ్యం పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. జంక్ ఫుడ్‌లో వాడే కెమికల్స్ క్యాన్సర్ వ్యాధికి దారి తీస్తాయని కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరాం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు అచ్చాల రవి, నాయకులు ఖజామెహిద్దీన్, అంజినాయుడు, నాగ, ఇలియాజ్, మురళి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన వ్యాను.. 15మందికి గాయాలు

పామూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపల్లి టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం ఎదురెదుగా ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీకొనగా 15 మందికి గాయాలయ్యాయి. రావిగుంటపల్లి జాతీయ రహదారి వద్ద పామూరు నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈప్రమాదంలో రెండు వాహనాలు ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. వ్యాన్‌డ్రైవర్‌తో పాటు ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కిశోర్‌బాబు సంఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణస్వామిని దర్శించుకున్న ఈవో దంపతులు



నారాయణస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న ఈవో దంపతులు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆలయాన్ని దేవదాయశాఖ ఉప కమిషనర్, మాలకొండ దేవస్థాన ఈవో చంద్రశేఖర్ దంపతులు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

- 50 ఏళ్ల పార్లమెంటేరియన్‌గా గిన్నీస్ రికార్డు
- వ్యవసాయ వర్సిటీకి ఆచార్య పేరు ఘనత మాదే
- జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'స్వాతంత్ర్య పోరాటంలో వెనకబడి పోతామనే కారణంతో రంగా దంపతులు పిల్లలనే వద్దనుకున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఆయన జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్జీ రంగా గురించి తెలుపుతూ ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయన్నారు. శుక్రవారం ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని లాంఫారంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. తొలుత రంగా కుటుంబసభ్యులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో సీఎం ఉపన్యసించారు. వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన రోజునే రంగా 125వ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో వ్యవసాయ యూనివర్సిటీకి, విభజన తర్వాత నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకి ఎన్జీ రంగా పేరు (మిగతా 6వ పేజీలో)

రంగానే నాకు స్ఫూర్తి

రైతు గౌరవమే దేశ గౌరవం. రైతు సంక్షేమమే దేశాభివృద్ధి.. అని ఎన్జీ రంగా చెబుతుండేవారు. పార్లమెంట్ లోపల, బయట ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. అవన్నీ నాపై ప్రభావం చూపించాయి. రూరల్ డెవలప్‌మెంట్‌పై పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు ఆయన రచనలు, అధ్యయనాలే నాలో స్ఫూర్తిని నింపాయి.

- సీఎం చంద్రబాబు



ఎన్జీ రంగా జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

ఈకేవైసీ పెండింగ్

- గడువు ముగిసినా 2.76 లక్షల కార్మికుల ఈకేవైసీ పెండింగ్
- పూర్తయిన వారికే పని, వేతనం
- అమలులో జాప్యం..అవగాహన కల్పనలో నిర్లక్ష్యం

ఉపాధి హామీ పథకం మస్టర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పనులకు హాజరు కాకుండానే వేతనం చెల్లించడం వంటి అవకతవకలు జరుగుతున్నాయి. ఇందులో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏటా రూ.కోట్లలో ఉపాధి నిధులు పక్కదారి పడుతున్నట్లు సామాజిక తనిఖీ తెలియజేస్తోంది. అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత నెల ఆరంభం నుంచి అమల్లోకి వచ్చిన ప్రక్రియ గడువు ముగిసినా.. ఈ నెలలో కూడా ఈకేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించినట్లు సబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ అమల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఇంకా 2.76 లక్షల మంది కూలీల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. ఈ పథకం అమలులో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కూలీలకు అవగాహన కల్పించి అందరికీ ఈకేవైసీ పూర్తి చేసే దిశగా అధికారు లు చర్యలు చేపట్టకుంటే వారు పనులను కోల్పోయే ప్రమాదం ఉంది.

'ఉపాధి'లో బోగస్ హాజరు నిరోధానికి ఎన్ఎంఎంఎస్



ఉపాధి పనుల్లో కార్మికులు(పాత చిత్రం)

పల్నాడు జిల్లాలో 5,40,928 మంది కూలీలకు జాబ్ కార్డులకు 5,32,092, బాపట్ల జిల్లాలో 4,32,348 మంది కూలీలకు గాను 4,29,863, గుంటూరు జిల్లాలో 2,03,292 మంది జాబ్ కార్డులకు 1,99,031 మంది కార్డులకు ఆధార్ సీడింగ్ పూర్తయింది.

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

పనులు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలు నష్టపోకుండా ఉండేలా.. బోగస్ హాజరును నిరోధించేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) అమలులోకి వచ్చింది. దీంతో పాటు ఫేస్ ఆర్‌డీ యాప్‌ను సైతం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. లేకుంటే చేసిన పనికి వేతనం చెల్లించే పరిస్థితి ఉండదు. ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి వరకు ఆదేశాలు జారీ అయ్యాయి. కూలీలకు అవహగాన లేక పోవడంతో ఈకేవైసీ చేయించు కునేందుకు ముందుకు రావడం లేదు. వారికి అవగాహన కల్పించాల్సి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి కూలీల జాబ్ కార్డు నంబరును నమోదు చేసి, ఐరిష్, ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న కూలీలను మాత్రమే ఉపాధి పనులకు అనుమతిస్తారు.. వేతనాలు చెల్లిస్తారు. ఈ నెల ఆరంభం నుంచి కూలీలు పని ప్రదేశంలో పని ప్రారంభించే ముందు ఒకసారి, పని ముగిశాక మరోసారి వ్యక్తిగత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే కూలీలకు వేతనాలు మంజూరవుతాయి. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టి, పనులకు వెళ్లే కూలీలకు మాత్రమే కూలి అందుతుంది.

జిల్లాల వారీగా ఉపాధి కూలీల ఈకేవైసీ వివరాలు

జిల్లా	కూలీల సంఖ్య	ఈకేవైసీ పూర్తి	ఈకేవైసీ పెండింగ్	శాతం
పల్నాడు	5,32,092	4,03,735	1,28,357	75.87
బాపట్ల	4,29,863	3,40,556	89,307	79.22
గుంటూరు	1,99,031	1,40,063	58,931	70.37

బోగస్ కార్డులకు చెక్

ఉపాధి పనులపై గ్రామాల్లో రాజకీయ నేతల ప్రభావం అధికంగా ఉంది. వీరి కనుసన్నల్లో (మిగతా 6వ పేజీలో)

పంటలు చూడకుండా నివేదికలా?

- తప్పుడు లెక్కలతో చేతులు దులుపుకుంటారా..?
- వ్యవసాయ అధికారులపై ఎమ్మెల్యే ఆనందబాబు ఆగ్రహం

వేమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతే.. వాటిని చూడకుండానే నివేదిక లు ఎలా ఇస్తారు.. రైతులు తీవ్రంగా నష్టపోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తుంటే.. తప్పుడు లెక్కలతో చేతులు దులుపుకుం టారా.. నష్టపోయింది మీ కళ్లకు కనబడటం లేదా.. ప్రభుత్వానికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను.. అంటూ ఎమ్మెల్యే ఆనందబాబు వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు నష్టపోయిన రైతులు ఎమ్మెల్యేని కలిసి వ్యవసాయ శాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని 17 గ్రామాల్లో పంటలు నష్టపోతే కేవలం ఐదు ఎకరాలని నివేదిక ఇచ్చారని వాపోయారు. ముఖ్యమంత్రి రైతులకు సహకరించేందుకు ముందుకు వస్తే ఇలా ప్రవర్తించడం ఎంతవరకు సబబని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. సమాధానం చెప్పని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలసత్వాన్ని విడనాడకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఇచ్చిన అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించి ఎక్కువగా వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతీ శుక్రవారం ఒక్కో మండలంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వందేమాతరం గీతాలాపన..

150 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఎమ్మెల్యే ఆలపించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిశోర్‌కుమార్, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, సీఐ రామాంజనేయులు, ఏపీఎం శోభన్, ఎస్ఐ శ్రీనివాసరావు, ఏవో ప్రేమ్‌సాగర్, సొసైటీల అధ్యక్షులు ఉక్కుర్తి నాగేశ్వరరావు, బొల్లిముంత నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటనకు రూట్ మ్యాప్ తయారు చేయాలి

రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటపొలాల సందర్శన, నష్టాల అంచనాలపై కేంద్ర కమిటీ బాపట్ల విచ్చేయు సందర్భంగా రూట్ మ్యాప్ తయారు చేయాలని రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. సచివాలయం నుంచి కలెక్టర్‌తో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బ్రిడ్జీలు సందర్శించి నష్టాల అంచనా వేసేందుకు ఈ నెల 10న కేంద్ర కమిటి జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో బాపట్ల, ప్రకాశం జిల్లాలో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బ్రిడ్జీలకు సంబంధించిన ఛాయచిత్ర ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దెబ్బతిన్న వరి పొలాల సందర్శనకు రూట్ మ్యాప్ తయారు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.6,600 కోట్లతో అభివృద్ధి పనులు

సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు ● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.6,600 కోట్లు మంజూరు చేయించినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం బాపట్ల మండలం గుడిపూడి గ్రామం నుంచి కర్లపాలెం వరకు రూ.2 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో పర్యాటకాభివృద్ధికి సంబంధించి రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్‌లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఆర్అండ్‌బీ మంత్రితో మాట్లాడి రూ.14.75 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మ తులు చేపడతామన్నారు. ప్రజలు కాంట్రాక్టర్ల కు సహకరించాలని అప్పుడే పనులు సకాలంలో పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు హనుమాన్‌జీ, ఆచంట అమ రేష్, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ వై.భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

అగ్నిమాపక సిబ్బంది పోరాట యోధులు

- అగ్నిమాపక కేంద్రం భూమిపూజలో మంత్రి పార్థసారథి

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల్లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సేవలు ఎనలేనివని, వారు పోరాట యోధులని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో చీరాలలో నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రానికి శుక్రవారం మంత్రి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను తెగించి ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. గుండ్లకమ్మ నదిలో చిక్కుకున్న వారిని సైతం ప్రాణాలకు తెగించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారని కొనియడారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రజలు ఆందోళనలో ఉండగా ఎమ్మెల్యే కొండయ్య ముందు చూపు కొంత ధైర్యాన్ని నింపాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ కృష్ణప్రసాద్, అగ్నిమాపక ప్రాంతీయ అధికారి ఎంఏ జిలాని, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, ఏడీఎఫ్‌వో రామకృష్ణ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్‌కుమార్

నష్టం.. 33,750 ఎకరాలే

పొంతన లేకుండా అధికారుల నివేదికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ధాటికి జిల్లా వ్యాప్తంగా 84,500 ఎకరాల్లో పంట ముంపు బారిన పడిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తేల్చింది. అయితే 33,750 ఎకరాల్లో మాత్రమే పంటలు నష్టపోయాయని తుది నివేదికలో తేల్చింది. తుఫాన్‌కు ముందు, ఆ తర్వాత భారీ వర్షాలతో జిల్లాలో పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. రోజుల తరబడి పొలాల్లో నీరు నిలిచి పంటలన్నీ వర్షార్పణమయ్యాయి. అయితే ప్రాథమిక అంచనాలకు మించి నష్టం పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ విజిట్‌తో ఏపీఎయిమ్స్ యాప్‌లో పంట నష్టం వివరాలు నమోదు శుక్రవారంతో ముగిసింది. నష్టపోయిన పంటల వివరాలతో తుది జాబితాను వ్యవసాయశాఖ ఖరారు చేసింది. కానీ ప్రాథమిక నివేదిక దరిదాపుల్లో కూడా తుది గణాంకాలు లేకపోవడంపై పలువురు విస్తుపోతున్నారు. ఏకంగా 50,750 ఎకరాలకు తుది జాబితాలో చోటు దక్కకపోవడం ఆశ్చర్య పరిచేదిలా ఉంది. దాదాపు ఐదు రోజులు పొలాలు ముంపులోనే ఉండగా తుది జాబితా మరీ ఇంత తక్కువగా ఎలా ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హడావిడిగా వాస్తవికతకు దూరంగా ప్రిలిమనరీ నివేదికను యంత్రాంగం చేసిందా లేక ఏపీ ఎయిమ్స్ యాప్ నిబంధన అనేదే నష్ట తీవ్రత లెక్కలు తగ్గడానికి కారణాలుగా ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదు, ఏపీ ఎయిమ్స్ యాప్ వంటి అంశాల పట్టింపు లేకుండా నష్టం వివరాల నమోదుకు మ్యాన్యువల్‌గా అవకాశం ఇస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కాలేదు.

తుఫాన్ సాయం గందరగోళం

- అస్తవ్యస్తంగా నిత్యావసరాల పంపిణీ
- రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి
- సమన్వయం లోపంతో బాధితులకు ఇబ్బందులు
- అర్హులకు ఫలాలు చేరాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీలో గందరగోళం నెలకొంది. భారీ వర్షాలతో రోజుల తరబడి మత్స్యకారులు, చేనేత కార్మికులతో పాటు పలువురు జీవనోపాధి కోల్పోయారు. ఈ క్రమంలో వారికి తక్షణ ఉపశమనం కోసం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలను కిట్ల రూపంలో యుద్ధ ప్రాతిపదికన అందించాలని యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. కానీ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ఓ ప్రహసనాన్ని తలపించేలా సాగుతోంది. నిత్యావసరాల కోసం పలు దఫాలుగా రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన వస్తోందని బాధితులు వాపోతున్నారు. బాధితుల్లో రేషన్‌కార్డు లేని వారుంటే వారికి కూడా మ్యాన్యువల్ ప్రాతిపదికన సాయం అందించాలని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా అమలు చేసే వారే లేరు. బాధిత కుటుంబాలకు సాయం అందించడంలో ఎలాంటి ఉదాసీనత కనబడకూడదని, అర్హులందరికీ ఫలాలు చేరాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా క్షేత్రస్థాయిలో పంపిణీ సాగుతోంది. నిత్యావసరాలను కిట్‌గా అమర్చి రేషన్ షాపులకు చేర్చాల్సిన బాధ్యత (మిగతా 6వ పేజీలో)



తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ (పాత చిత్రం)



సంతనూతలపాడులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు



పోలీస్‌పెరేడ్ మైదానంలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు, సిబ్బంది

స్వాతంత్ర్య సమర నినాదం 'వందేమాతరం'

- ఎస్పీ హర్షవర్ధనరాజు
- ఘనంగా వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలు

ఒంగోలు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భరత జాతిని ఒక్కటి చేసిన సమర నినాదం వందేమాతర గీతం అని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం అంటే తల్లీ నీకు నమస్కారం అని అర్థమన్నారు. మన మాతృభూమికి అంకితమైన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు , టి.విజయకృష్ణ, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు స్ఫూర్తి..

ఒంగోలు(రూరల్): వందేమాతరం గీతం దేశసమైక్యతకు నాంది అని, ప్రతి ఒక్కరూ ఆలపించాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఆ గేయాన్ని రచించిన



ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న ఉద్యోగులు

బంకించంద్రచటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడు తూ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గీతం దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చింద న్నారు. ఈ కార్యక్రమంలో శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్, ఏపీఎం నాగేశ్వరరావు ఏపీవో విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

ఒంగోలు విద్య: నగరంలోని అన్ని విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్‌చక్రవర్తి, విభాగాధిపతి పి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామపిచ్చయ్య, ఏవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ డీవీఆర్.మూర్తి, ప్రిన్సిపాల్ నిర్మలామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో ఉత్తేజాన్ని నింపిన వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మండల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం వందేమాతరం గేయం ఆలపించారు. కార్యక్రమంలో ఎంపిడీవో బి.రామాంజనేయులు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది వందేమాతరం. శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేఖ, ఎంఈవో 2 రామారావు, సాయిబాబా స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: వందేమాతరం గీతం 150 సంవత్సరాల సంబరాన్ని దొడ్డవరప్పాడులోని బీపీ అండ్‌కేఆర్ విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కాలేజీ హెచ్‌వోడీ కవిత, ప్రొఫెసర్ జీవీ.సుబ్బమ్మ, షమ్మీర్, సంతోష్‌కుమార్, రమా, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

తుఫాన్ సాయం.. గందరగోళం

(5వ పేజీ తరువాయి)

సివిల్ సప్లయిస్, రెవెన్యూ విభాగానిది. కానీ క్షేత్రస్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంతో తుఫాన్ బాధితులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజువారీ పంపిణీ ఎన్ని కుటుంబాలకు జరిగింది, ఇంకా ఎన్ని కుటుంబాలకు సాయం అందించాల్సి ఉందనే ప్రాథమిక సమాచారం కూడా డీఎస్‌వో వద్ద ఉండకపోవడం సమన్వయలోపాన్ని సూచిస్తోంది.

సా..గుతున్న ప్రక్రియ

తుఫాన్ ప్రభావిత కుటుంబాలను 33,750గా యంత్రాంగం లెక్క తేల్చింది. 356 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారి సంఖ్య 12,200 కుటుంబాలు ఉన్నాయి. వీరితో పాటు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు 13,000, చేనేత కుటుంబాలు 8,550 మందిని నిత్యావసరాల సాయానికి అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీరిలో పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు, మత్స్య, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యంతో పాటు పామాయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు కేజీ, కందిపప్పు కేజీ, పంచదార కేజీ, బంగాళాదుంపలతో కిట్ రూపంలో అన్నీ ఒకేసారి అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. పంపిణీ ప్రక్రియ మూడు రోజుల్లోనే పూర్తి కావాలని ప్రభుత్వం సూచించింది. కానీ శుక్రవారం వరకు ఎంత పంపిణీ జరిగిందనేది పౌర సరఫరాల విభాగం వద్ద స్పష్టత లేదు. బాధితులు సమీపంలోని రేషన్ షాపులో నిత్యావసరాలు అందుకునేలా మ్యాపింగ్ చేసింది. 25 మండలాల పరిధిలో 686 షాపులను ఇందుకు ఎంపిక చేసింది. మ్యానువల్‌గా కూడా డీఎస్‌వో అభ్యర్థన మేరకు మరికొన్ని దుకాణాల్లో బాధితులకు నిత్యావసరాలు అందేలా ఏర్పాట్లు చేసింది. ఈ మొత్తం ప్రక్రియ అంతా గజిబిజిగా మారింది. నిత్యావసరాలు అందుకోవడానికి బాధితులకు పోర్టబులిటీ అవకాశం కల్పించినా అది అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. బియ్యం, పంచదార తొలుత రేషన్ డీలర్ల వద్దకు చేరాయి. తర్వాత రోజు దుంపలు, ఉల్లిపాయలు, ఇంకో రోజు కందిపప్పు, పామాయిల్ ఇలా వ్యవధి ఇస్తూ డీలర్ షాపుల వద్దకు నిత్యావసరాలు చేరాయి. నిత్యావసరాల కోసం మూడు సార్లు రేషన్ దుకాణం చుట్టూ తిరిగి థంబ్ వేసి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు బాధితుల మ్యాపింగ్ డీలర్ పరిధిలో కానీ వారు ఎక్కువుగా ఉండడంతో వారికి సమాచారం చేరడం కూడా కష్టమైపోయింది. ఇదిలా ఉంటే ఇదే అదనుగా రెండు సరుకులు మాత్రమే ఇచ్చి ఆరింటికి థంబ్ వేయించుకుని పక్కదారి పట్టించిన డీలర్లూ ఉన్నారు. కార్డులు లేని కుటుంబాలకు భటిప్రోలు మండల పరిధిలో ఇచ్చిన సరుకులను కూడా డీలర్లు వెనక్కి తీసుకున్నారని సమాచారం.

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పెట్టినట్లు గుర్తుచేశారు. 33 ఏళ్ల వయసులోనే ఆయన రైతుల ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన అడ్డుకున్నారన్నారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా చేసిన సేవలకు గిన్నీస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలన్నారు.

సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ వీవీ సత్యనారాయణ, శాస్త్రవేత్త కుర్రా శ్రీనివాసబాబు, ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి.యుగంధర్, బి. నాగేశ్వర్‌మిత్రా, ఆదర్శ రైతు కుంచాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ 'పెండింగ్'?

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను ఫీల్డు అసిస్టెంట్లుగా నియమించుకోవడం అనవాయితీ. రాజకీయ అండదండలు, అధికారుల సహకారంతో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. ఈకేవైసీ, ఎన్ఎంఎంఎస్‌ను అమల్లోకి తీసుకురావడంతో బోగస్ జాబ్ కార్డులకు కూడా చెక్ పెట్టినట్లయింది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రైవేట్ ఉద్యోగుల పేర్లపై జాబ్ కార్డులు సృష్టించి వేతనం కొట్టేస్తున్న ఉదంతాలు కోకోల్లలు. పనికి రాకుండానే రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఉపాధి కార్మికుని పేరుతో వేతనాలు చెల్లించడం పెద్దఎత్తున జరుగుతోంది. ఏటా రూ కోట్లలో ఉపాధి నిధులను కొందరు అధికా రులు.. ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుతింటున్న ఉదంతాలు సామాజిక తనిఖీలో వెలుగు చూసినా.. వారిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కొట్టేసిన సొమ్మును రికవరీలు కూడా ఉండటం లేదు. నూతన హాజరు విధానంతో కొంత మేర అక్రమాలను అరికట్టే అవకాశం ఉంది.

దళిత ఉద్యోగులను దూషించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో దళిత వర్గానికి చెందిన ఇద్దరు ఆఫీసు సబార్డినేటర్లను కులం పేరుతో దూషించడమే కాకుండా చేయి చేసుకున్న ఉన్నతాధికారి రవీంద్రనాథ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద ఏపీ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ వాణిజ్యపన్నులశాఖ ఆఫీసు సబార్డినేట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతరం స్ఫూర్తితో హక్కుల కోసం నినదిస్తూనే ఉంటామన్నారు. దళిత ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 14వతేదీన కార్యాచరణ చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ల నాయకులు జాజుల నరసింగరావు, జె.సుజాతబాయి, తోట కిరణ్‌కుమార్, కరిచేటి సుధాకర్, ప్రసన్నకుమార్‌రెడ్డి, రవికుమార్, యూవీ.సుబ్బారావు, వై.కొండలరావు, ఎస్‌కే.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం



వెంకటకృష్ణారావు, చంద్రబాబులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఆచార్య రంగా కిసాన్‌సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అనేక సేవలు అందిస్తున్న కనపర్తి ఎత్తిపోతల పథకం, ఉప్పుగుండూరు సొసైటీలు ఉత్తమ పథకాలుగా ఎంపికయ్యాయి. దాంతో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, 20 సూత్రాల పథకం అమలు చైర్మన్ లంకా దినకర్ చేతుల మీదుగా కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, ఉప్పుగుండూరు సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబుకు అవార్డులను అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నడిపినేని శేషగిరి, గొల్లకారం వెంకట్రావు, పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, సొసైటీ సీఈవో నన్నపనేని కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

పొన్నలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్య అధికారి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి కృష్ణ చైతన్య మాట్లాడుతూ శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా విపరీతంగా పెరిగిపోవడమే క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఆహార అలవాట్లు, రేడియేషన్లు, ధూమపానం, ఊబకాయం, తదితరాలు క్యాన్సర్‌కు కారకాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడులో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఓనారియల్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

- సమస్యల పరిష్కారం దిశగా కమిటీ అడుగులు
- అమరావతిలో ప్రత్యేక సమావేశం
- తమ డిమాండ్లను కమిటీ ముందుంచిన ఓనర్ల అసోసియేషన్

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ తన పనిని మొదలుపెట్టింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో కమిటీ తన తొలి సమావేశాన్ని నిర్వహించింది. కమిటీ చైర్మన్, మైన్స్ జేడీ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు. ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో చీమకుర్తి, బూదవాడ, మార్టూరు, చిలకలూరిపేట, పల్నాడు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ప్రధాన నాయకులు పాల్గొన్నారు. వీరు తమ డిమాండ్లను, గ్రానైట్ పరిశ్రమ మనుగడకు తీసుకోవాల్సిన నిర్ణయాలను కమిటీ ముందు ఉంచారు. ట్రాన్సిట్ ఫారంను రద్దు చేయాలని, శ్లాబ్



సమావేశంలో పాల్గొన్న గనులశాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

సిస్టంలో భాగంగా కొనుగోలు చేసిన క్యూబిక్ మీటర్ ముడిరాయిపై ఇస్తున్న అనుమతిని 350 అడుగుల నుంచి 450కి పెంచాలని కోరారు. మైనింగ్ రాయల్టీని ప్రభుత్వం నిర్ధేశించిన మేరకే చెల్లిస్తామని, అదనంగా చెల్లించలేమని తెలిపారు. ఈసీ క్వాంటిటీని పరిశీలించాలని కోరారు. ఈ డిమాండ్లపై కమిటీ సభ్యులు స్పందిస్తూ తామే స్వయంగా గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించి తగు నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. సమావేశంలో చీమకుర్తి ప్రాంతం నుంచి అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, ఇంటూరి భవానీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. కమిటీ తన విచారణను ఈనెల 15వ తేదీలోపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ఈ నివేదిక పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గ్రానైట్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనుంది.

18న సామాజిక న్యాయంపై ధర్నాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదలోనే కాకుండా చట్టసభల్లో, అన్ని రంగాల్లో అందరికీ వాటా కావాలంటూ ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ధర్నాలు, సదస్సులను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి కేవీ.కృష్ణగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరగాలన్నారు. కులాల్లోని జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు చట్టసభల్లో, సంపదలో, అన్ని రంగాల్లో వారి వాటా వారికి దక్కాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం దేశ సంపదను,



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

పరిశ్రమలను. సహజసంపదను కొద్ది మంది కార్పొరేటర్ల చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. దీంతో పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సయ్యద్‌యాసిన్, నల్లూరి మురళి, శ్రీరామ్ శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్. రామకృష్ణ, వి.హనుమారెడ్డి, ఎస్‌డీ.మౌలాలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు వెళ్లే దారేది

బల్లికురవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్‌తో పంట



వర్షాలతో కోత పడిన రోడ్డు

పొలాలకు వెళ్లే రోడ్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసే వీలు లేక రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని వల్లాపల్లి గ్రామంలో పరమర వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లే రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతింది. రోడ్డు మొత్తం కోతకు గురైంది. బురదమయంగా మారడంతోపాటు కల్వర్టు వద్ద రెండు వైపులా రోడ్డు కోతకు గురికావడంతో రైతులు పంటల సాగుకు వెళ్లే దారి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు వందల ఎకరాల పంట భూములకు



వల్లాపల్లిలో దెబ్బతిన్న పొలాలకు వెళ్లే రహదారి

వెళ్లే దారి కావడంతో రైతులు ఈ రోడ్డున వాహనాలు వెళ్లే వీలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు వెంటనే అభివృద్ధి చేయకుంటే ఈ ఏడాది పంటలు సాగు చేయడం కష్టం అని రైతులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో అయిన రోడ్డును వెంటనే అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

టంగుటూరు(కొండపి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అన్నపరెడ్డి చందన రాష్ట్రస్థాయి పో టీలకు ఎంపికయింది. డిస్కస్‌త్రో ఈవెంట్ మొదటి స్థానాన్ని సాధించిందని పీడీ అరుణ తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

జెండా ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 60అడుగుల రోడ్డులో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు జి.రమేష్ మాట్లాడుతూ 1917లో రష్యాలో విప్లవం వచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితో ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పార్టీలు ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్.వీరస్వామి, వి.మాలకొండయ్య, భీష్మాచారి, జి.ఆదిలక్ష్మి, టి.భక్తసింగ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యాశిక్షణలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జరిగిన ఒకేషనల్ శిక్షణ వస్తువులు ప్రదర్శనలో బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం బాపట్ల జిల్లా కేంద్రంలో 40 పాఠశాలల స్థాయిలో జరిగిన పోటీల్లో బల్లికురవ కేజీబీవీ విద్యార్థులు తాము ఎంతో పట్టుదలతో విద్యాలయంలో నేర్చుకున్న కలంకారి డిజైన్లు, కుట్టు మిషన్లకు సంబంధించిన పలు రకాల వస్తువల తయారీపై నలుగురు విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. వీటిని జిల్లా విద్యాశాఖ డీఈవో పురుషోత్తం, డిప్యూటీ ఈవో గంగాధర్, జీసీడీవో చారులత, వైద్యఆరోగ్యశాఖ అధికారి విజయమ్మలు విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన శిక్షకురాలు కొటారి శిరీషను ప్రత్యేకంగా అభినందించి వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాలయ ప్రిన్సిపాల్ సరళకుమారి, ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పొదుపు సంఘాల బలోపేతానికి రికార్డులు తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న వెలుగు అధికారులు

బల్లికురవ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పొదుపు సంఘాల బలోపేతానికి రికార్డులు తనిఖీలు చేస్తున్నామని వెలుగు ఏపీఎం తుమాటి రాజారావు అన్నారు. మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో 12 వీవోఏలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. తీర్మాన పుస్తకాలు, నగదు లావాదేవీలు, స్త్రీనిధి వంటి రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో నిరుపేదలకు వెలుగు ద్వారా రుణాలను సకాలంలో అందేలా చర్యలు చేపడతామన్నారు. వెలుగు వీవోఏలు కూడా అన్ని రికార్డులు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ప్రతి రుపాయికి ఖర్చులు వ్యయంపై నమోదు చేసి ఉండాలని వారు తెలిపారు. ఈ తనిఖీలో స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు ప్రమీలా, పేరయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అద్దంకి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజులు కోరారు. మెగా ఉచిత వైద్యశిబిరం జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లను శుక్రవారం టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు శంకరకంటి వైద్యశాలలో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు 7013723538, 7013898890 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, క్లష్టర్ ఇన్‌చార్జ్‌లు కాకాని అశోక్, కుండారపు రామారావు, లహరి, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, రామాంజనేయులు, గుంజి శ్రీనివాసరావు, రామాంజనేయులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటివైద్యశిబిరం

మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజానీకం సద్వినియోగపరచుకోవాలని ఆయన కార్యాలయ ప్రతినిధులు కోరారు. ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్, గ్రీన్ స్పార్క్‌ఫౌండేషన్ సంయుక్తంగా, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాకుండా శిబిరానికి వచ్చినవారికి కంటి పరీక్షలతోపాటు, బీపీ, షుగర్, రక్తపరీక్షలను నిర్వహిస్తారన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కోసం పంపిస్తామన్నారు.

చీరాల, పొన్నూరులో మొబైల్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు

- చీరాల్లో ఈనెల 10, పొన్నూరులో 11వ తేదీన అవకాశం

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ఈనెల 10న చీరాల మహిళ మండలి వద్ద, 11వ తేదీన పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ పోర్ట్ మంత్రిత్వశాఖ, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నసేవలను పొందేందుకు వివరాలకు 86625 70050ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

కేజీఎం విద్యార్థినులకు బంగారు పతకం


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏలూరులో నిర్వహించిన 69వ అండర్-17 తైక్వాండో పోటీల్లో స్థానిక కేజీఎం బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ తాహిరా ఉత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం దక్కించుకొని బంగారు పతకం సాధించింది. అలాగే తస్లీమా సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

తీరంలో ఎంపీ, కలెక్టర్ విస్తృత పర్యటన

- తుఫాన్ ప్రభావంతో కూలిన వంతెనలు పరిశీలన
- వెంటనే నిర్మాణాలకు ఆదేశాలు



కూలిన కల్వర్టులను పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్

వాడరేవు(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం తీర ప్రాంతాల్లో శుక్రవారం ఎంపీ కృష్ణ ప్రసాద్, కలెక్టర్ డావినోద్‌కుమార్‌తో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా తుఫాన్ ప్రభావంతో కూలిన కల్వర్టులు, చప్టాలు పరిశీలించారు. రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోవడంపై ఆరా తీశారు. కూలిన చోటల్లా వంతెనల ఏర్పాటుకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. మొత్తం మూడు వంతెనలు, ఒక చప్టాకు సంబంధించి సుమారు రూ. రూ.6 కోట్లతో హై లెవల్ వంతెనల నిర్మాణంపై చర్చలు జరిపారు. వారివెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

మురుగు కాలువలలో పూడికతీత పనులు


ముప్పవరంలో మురుగు కాలువలలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగివరం, ముప్పవరం గ్రామాలలో మురుగు కాలువలలో పేరుకున్న పూడిక తొలగింపు చర్యలు శుక్రవారం ప్రారంభించారు. మురుగు కాలువలలో పేరేకున్న మురుగుతో దుర్గంధంతో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలలో మురుగు కాలువలలో చేరిన పూడికతో వర్షపు నీరు ముందుకుపోని పరిస్థితిని గుర్తించిన అధికారులు పూడిక తొలగింపునకు శ్రీకారం చుట్టారు. పనులను పంచాయితీ కార్యదర్శులు ఎల్.సునీత, జానీబేగం పర్యవేక్షించారు.



స్వాతంత్ర్యోద్యమానికి వందేమాతర గీతం స్ఫూర్తి

- విద్యార్థులతో కలసి గీతం ఆలపించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- చినగంజాంలో ర్యాలీ నిర్వహించిన పాఠశాల విద్యార్థులు


వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధులకు వందేమాతర గీతం స్ఫూర్తి నింపిందని మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్ కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం చీరాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతర గీతం ఒకటిన్నర శతాబ్దం పూర్తి చేసుకున్న నేపథ్యంలో గీతాన్ని విద్యార్థులతో కలిసి ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గీతం ఆలపించి 150 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన వేడుకలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల్లో ప్రతిరోజు గీతాన్ని ఆలపించేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. గీత రచయత బంకించంద్ర ఛటర్జీ, రైతు ఉద్యమ నేత ఆచార్య ఎన్‌జీ రంగల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : 150 వసంతాలు పూర్తి చేసుకున్న వందేమాతర గీతం దేశ ఔన్నత్యాన్ని, విశిష్టతను చాటిందని కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐ.అనిత అన్నారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం 150 వసంతాలు పూర్తయిన వందేమాతర గీతం, 75వసంతాల స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుక ఘనంగా నిర్వహించారు. వందేమా తరం గీతంపై విద్యార్థులకు వ్యాసరచన, స్వాతంత్ర్యో ద్యమం, పాల్గొన్న యోధుల చిత్రాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటి ప్రాధాన్య తను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలం లోని నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశా లలో నిర్వహిచిన వేడుకలో హెచ్ఎం జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్), ఉపాధ్యాయులు వీరాంజనే యులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

పంగులూరు: మన దేశ జాతీయగీతమైన వందేమాతర గీతం 150 ఏళ్ల వసంతాల వేడుక పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీత రచయిత బంకించంద్రచటర్జీ చిత్ర పటంవద్ద ఎంపీడీవో కె.స్వరూపారాణి నివాళి అర్పించారు. కార్యాలయ సిబ్బంది భక్తి భావంతో వందేమాతర గీతం ఆలపించారు. కార్య క్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, వైద్యాధికారి డాక్టర్ శివ చెన్నయ్య, కార్యాలయ పరిపాలనాధికారి టి.రమేష్, రిబ్కా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బంకించంద్రఛటర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పంగులూరు ఎంపీడీవో, చినగంజాంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వందేమాతరం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బంకించంద్రచటర్జీ రచించిన జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్ల పూర్తి అయిన సందర్భం గా మండల పరిధిలో వేడుకలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో వందేమాతరం గీత రచయిత బంకించంద్రచటర్జీ చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించి వందేమాతర గీతం ఆలపించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, తహసీల్దార్ జె.ప్రభాకరరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, మండల సర్వేయర్ లోకేష్, గ్రామ కార్యదర్శులు కె.అంజయ్య, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ అపోహ మాత్రమే
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అపోహ మాత్రమే అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం చేసే చర్యలను తమ ప్రభుత్వం చేపట్టదన్నారు. వైసీపీ రాజకీయ ఉచ్చులోనికి రైతులను లాగుతోందని, రైతులు ఆ ఉచ్చులో పడవద్దన్నారు. ఈ అంశానికి స్పందించిన పూర్వాపరాలను ఆయన వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం పీ4 పథకాన్ని చిత్తశుద్ధితో అమలుచేస్తున్నారన్నారు. సీఎం పిలుపు మేరకు ఈ పథకంలో భాగమయ్యేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ ముందుకు వచ్చాడన్నారు. బాపట్ల జిల్లా అప్పాపురం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మించి ప్రాంత రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పెట్టబడి పెట్టేందుకు ముందుకు వచ్చాడన్నారు. అయితే డీపీఆర్ తప్పుల తడకగా ఉందన్నారు. దానిపై సాంకేతిక పరంగా లోపాలు ఉన్నాయని గుర్తించి, ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే ఈ ప్రతిపాదనను తిరస్కరించిందన్నారు. ఈ పథకానికి సంబంధించి సాంకేతిక అంశాలపై తాను కూడా స్వయంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. ఈపథకం ఏర్పాటుకు సంబంధించి ఏమైన అనుమానాలు ఉంటే సంబంధితశాఖ మంత్రి, అధికారులతో నివృత్తి చేయించే బాధ్యత తనదేనని, రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే స్పష్టమైన భరోసా ఇచ్చారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ ఉచ్చులో పడవద్దన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొమ్మమూరు కాలువలను నిర్లక్ష్యం చేసిందని, కనీసం మరమ్మతులు కూడా కల్పించకపోవడంతో కాలువ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే చివరి భూములకు కూడా నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. రైతులు ఏ ప్రాంతంలో ఉన్నా, వారి ప్రయోజనాలు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ పనుల పరిశీలన

- పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. శుక్రవారం ఏరియా వైద్యశాల సమీపంలో జరుగుతున్న పనులను సూపరిండెంట్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. పనులకు సంబంధించి ఆరా తీశారు. అలాగే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. 80 మందికి రూ.48,12,835 విలువైన చెక్కులను అందజేశారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ చెప్పారు. మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, డాక్టర్ సుభాషిణీ తదితరులు ఉన్నారు.

ఆర్‌డీఎస్ఎస్ ద్వారా గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్


నూతన స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా ఆర్‌డీఎస్ఎస్ పథకం ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. ఈ పథకంలో భాగంగా మండలంలోని జార్లమూడివారి పాలెం, బైటమంజులూరు గ్రామాలలో విద్యుత్ లైన్లను ఎత్తైన నూతన విద్యుత్ స్తంభాలు, అధునాతన కేబుల్ ఏర్పాటుతో ఆదునీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుతో గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్య తీరడంతో పాటు త్రీఫేస్ విద్యుత్ నిరంతరం పొందే అవకాశం ఉంటుందన్నారు. జేవీ.పాలెంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కార్యక్రమంలో శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కామేపల్లి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలి

తక్షణమే మరమ్మతులు చేయాలని వినతి



వినియోగంలో లేని ఎత్తిపోతల పథకం

సంతమాగులూరు నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి గ్రామ రైతులకు సంబంధించిన ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి తక్షణమే వినియోగంలోకి తేవాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద 561 ఎకరాలలో ఆరుతడి పంటలు సాగు చేశారు. రెండు దశాబ్దాల క్రితం పథకం నిర్మించిన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ ఎత్తిపోతల పథకం మూతపడింది. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురవడం, వాగులు, వంకలు పొర్లి ప్రవహిస్తుండడంతో తిరిగి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోనికి తేవాలని రైతులు కోరుతున్నారు. నవంబరు నెల నుంచి వర్షాలు తగ్గుముఖం పడతాయని, మిర్చి, ప్రత్తి, లాంటి వాణిజ్య పంటలకు ఆరుతడి సాగు కింద నీరు పెట్టుకునేందుకు ఈ ఎత్తిపోతల పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఎత్తిపోతల పథకం వైపు అధికారులు దృష్టి సారించకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి చిన్నపాటి మరమ్మత్తులు పూర్తిచేసి తక్షణమే వినియోగంలోకి తేవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధుడి నుంచి నగదు అపహరణ

బ్యాంకులో లోన్ కట్టేందుకు వెళ్లగా పథకం ప్రకారం చోరీ

ఇంకొల్లు, నవంబరు 7,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఓ వృద్ధుడి నుంచి ఇద్దరు దుండగులు రూ.3.90లక్షలు నగదును అపహరించుకొని వెళ్లిన ఘటన ఇంకొల్లులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంకొల్లుకు చెందిన చిలంకూరి కాంతయ్య(75) ఉదయం 11 గంటల సమయంలో బ్యాంకు ఆఫ్ ఇండియాలో తను తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు రూ.3.90లక్షలు తీసుకొని సైకిల్‌పై వచ్చాడు. అయితే బ్యాంకులో అప్పు రూ.4లక్షలు ఉందని అధికారులు తెలపడంతో మిగిలిన రూ.10వేలు తెచ్చుకునేందుకు ఇంటికి వెనుదిరిగారు. సైకిల్‌పై కాంతారావు బయలుదేరి ఇంటి సమీపంలోకి చేరుకోగా మోటర్‌సైకిల్‌పై ఇద్దరు దుండగులు వెంబడించి వెళ్లి రూ.100 నోట్లు రెండు కిందవేసి నీ డబ్బులు పడిపోయాయయని చెప్పి యామార్చారు. వాటిని కాంతారావు తీసుకునే ప్రయత్నంలో ఉండగా సైకిల్ క్యారేజిపై ఉంచిన రూ.3.90లక్షల నగదు బ్యాగును వారు అపహరించుకొని పరారయ్యారు. గమనించిన బాధితుడు కాంతారావు ఇరుగుపొరుగువారికి విషయం తెలిపేలోపు వారు పరారయ్యారు. కాంతారావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

- నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ఘటన వేటపాలెం మండలం జాతీయ రహదారిలోని గాయత్రి రెస్టారెంట్ సమీపంలో చోటుచేసుకుంది. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జబ్బార్ కాలనీకు చెందిన షేక్ షాహీద్(60) కాలినడకన రెస్టారెంట్ వైపు నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. దీంతో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వేగంగా ఢీ కొనడంతో ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్‌కు వేటపాలెం మండల పరిధిలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు చల్లారెడ్డి పాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, కొత్తపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం గ్రామాల్లో సేవలకు అంతరాయం ఉంటుందన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో లారీల బ్యాటరీలు చోరీ

బల్లికురవ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నుపల్లి రోడ్డులో గ్రానైట్ ఫ్యాక్టరీలోని లారీల నుంచి ఆరు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నిలిపి ఉంచిన లారీల నుంచి బ్యాటరీలు చోరీ కావడంతో లారీల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ


పాఠశాలకు బీరువా బహూకరిస్తున్న మోపర్తి లక్ష్మీనారాయణ

మేదరమెట్ల, ,నవంబరు 7,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావినూతల మండల పరిషత్ పాఠశాలకు పలువురు దాతలు ఇనుప బీరువా కుర్చీలను పంపిణీ చేశారు. శుక్రవారం రావినూతలలో మోపర్తి శేషయ్య, వెంకటరత్నంల జ్ఞాపకార్థం, రూ.16 వేల విలువైన బీరువాను మోపర్తి లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావులు ప్రధానోపాధ్యాయుడు చేబ్రోలు గోపీకి అందజేశారు. కారసాల చిన్న వీరయ్య, చేబ్రోలు అనంత వరప్రసాద్‌ల జ్ఞాపకార్థం కారసాల శ్రీనివాసన్ నాలుగు కుర్చీలను పాఠశాలకు బహూకరించారు. పాఠశాలకు దాతలు సౌకర్యాలు కల్పించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రోన్లతో రైతులకు బహుళ ప్రయోజనాలు


డ్రోనును అందజేస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

మేదరమెట్ల, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో డ్రోన్లను ఉపయోగించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయని, అద్దంకి ఏడీఏ బి. ఎప్రాయం తెలిపారు. శుక్రవారం మండలంలోని రావినూతల, పమిడి పాడు గ్రామాల్లో రెండు గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లకు 80 శాతం రాయితీతో డ్రోన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ డ్రోన్లను రైతులు ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల పిచికారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులం దరూ ఉపయోగించు కోలన్నారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ. 9.80 లక్షలు కాగా, రాయితీ రూ.7.80 లక్షలు పోను రూ.2 లక్షలు ఈ గ్రూపు చెల్లించాలన్నారు.

పమిడిపాడు సొసైటీలో రైతులకు 25 శాతం రాయితీపై శనగ విత్తనాలను సొసైటీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ వ్యవసాయాధి కారులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిన్నక శ్రీధర్, మామిళ్ల ఎల్లి హనుమంతరావు, కామినేని శ్రీనివాసరావు, పిన్నక శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అనుసరించే వాహనాలు నడపాలి

- ప్రైవేటు ట్రావెల్స్, లారీలు తనిఖీ చేసిన సీఐ శేషగిరిరావు


బస్సును తనిఖీ చేస్తున్న సీఐ శేషగిరిరావు

వేటపాలెం (చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అనుసరించే వాహనాలు నడపాలని రూరల్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి వేటపాలెం ఎస్సై జనార్ధన్‌తో కలిసి 216 జాతీయ రహదారిలో ప్రైవేట్ ట్రావెల్స్, లారీలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ప్రజల ప్రాణాల పట్ల వాహనాల డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలకు బాటలు వేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అధికారులు వెంట ట్రైనీ ఎస్సైలు అలేఖ్య, జగ్జీవన్‌రావు, కానిస్టేబుల్ మల్లి తదితరులు ఉన్నారు.

వందేమాతరం.. మహత్తర గేయం

● 150 ఏళ్ల వేడుకలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టరేట్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా అధికారులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సంగ్రామంలో భారతీయులను ఏకతాటిపైకి తీసుకొచ్చి, స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన మహోన్నత దేశభక్తి గీతం వందేమాతరం అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో కలెక్టర్‌తో పాటు, జిల్లా అధికారులు, సిబ్బంది వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వందేమాతరం గేయాన్ని ఆలపించి, ఆ గేయం గొప్పతనాన్ని, కీర్తిని మరోసారి గుర్తుకు తెచ్చుకుంటున్నామని చెప్పారు. ఈ గేయం యావత్ భారతజాతిని సంఘటితం చేసి, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించిందని చెప్పారు. మతాలు, భాషలు, ప్రాంతాలు వేరైనా మనమంతా భారతీయులమనే విషయాన్ని గ్రహించి, అందరం ఐకమత్యంతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, కలెక్టరేట్ ఏవో తమ్మా విజయకుమార్, మత్స్యశాఖ జేడీ శాంతి, ఐఅండ్‌పీఆర్ డీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఈ శివశంకర్, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

నెల్లూరు(క్రైం) : స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల మాట్లాడుతూ వందేమాతరం కేవలం ఒక గేయం మాత్రమే కాదని, దేశస్వాతంత్ర్య సంగ్రామంలో కోట్లాది మంది భారతీయుల హృదయాల్లో స్ఫూర్తిని రగిలించిన జాతీయగీతమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు జీ. శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో వందే మాతరం గేయాన్ని ఆలపిస్తున్న పోలీసులు

● వందేమాతరం గీతం దేశభక్తిని నింపింది..

నెల్లూరు (జడ్పీ) : వందేమాతరం గీతం మనలో దేశభక్తి, త్యాగం, ఐక్యత అనే విలువలను నింపిందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ఇన్‌చార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డితో కలిసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేమాతరం అనే మాట పలికినప్పుడు భారతీయుల్లో ఒక శక్తి, గర్వం, ఆత్మవిశ్వాసం ఉద్భవిస్తుందన్నారు. అనంతరం జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది అందరూ కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.



జిల్లాలోని కొన్ని కీలక సమస్యలను పలు సమావేశాల్లో చర్చిస్తున్నా, వాటికి పరిష్కారం మాత్రం దొరకడంలేదు. ఈ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఆదేశించడం...ఆ తర్వాత వాటిని పట్టించుకునే పరిస్థితి యంత్రాంగంలో కనిపించకపోవడం ఆనవాయితీగా మారింది. కీలకమైన బ్యారేజీల నిర్వహణ, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, నెల్లూరులో ఫ్లైవోవర్ల నిర్మాణం, లస్కర్ల నియామకం, ప్రాజెక్టులకు భూసేకరణ... వంటివి సుదీర్ఘకాలంగా తిష్టవేసిన సమస్యలు. వీటి పరిష్కారానికి ఆదేశాలు ఒక్కటే చాలదని, ఆ తర్వాత ఫాలోఅప్ కూడా ఉంటేనే ఫలితం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఈ క్రమంలోనే మరోమారు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ(డీఆర్సీ) సమావేశం నిర్వహించనున్నారు.



నెల్లూరులోని కొండాయపాలెం రైల్వేగేటు వద్ద వేచి చూస్తున్న వాహనదారులు

మాటలు కాదు.. ఆచరణ కావాలి!

● నేడు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం

● ఆ వెంటనే ఐఏబీ నిర్వహణకు ఏర్పాట్లు

● పలు సమస్యలకు ఏళ్ల తరబడి దొరకని పరిష్కారం

● గత సమావేశాల్లోనూ వివిధ అంశాల ప్రస్తావన

● ఇప్పటికీ ఎక్కడి గొంగళి అక్కడే...

నెల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ దఫా కూడా పలుశాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. అయితే ఈ సారైనా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

● నగరవాసులకు నరకం

ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి నెల్లూరు నగరంలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభమవుతుందన్న ప్రచారం తప్ప ఆచరణ కనిపించడంలేదు. గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే ఈ రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికిపై బడ్జెట్ కేటాయించింది. అప్పుడప్పుడు అధికారులు మీటింగ్ పెట్టుకొని వెళ్లిపోతుంటారు తప్ప... ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఈ ఏడాది జూన్‌లోనే బీవీనగర్, కొండాయపాలెం గేట్ల స్థానంలో బాక్స్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని అధికారులు ప్రకటించారు కానీ, ఆ గడువు ముగిసి కూడా ఐదు నెలలవుతోంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. ఫ్లైవోవర్ నిర్మాణానికి అవసరమైన మేరకు భవనాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

● బ్యారేజీల నిర్వహణ గాలికి..

సంగం, నెల్లూరు బ్యారేజీల నీటిని కాలువలకు మళ్లిస్తూ ఆయకట్టును సాగు చేస్తున్నారు. ఈ రెండు బ్యారేజీలను రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే వీటి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఈ రెండు బ్యారేజీల వద్ద ఉన్న గేట్లను ఎత్తేందుకు, దించేందుకు ఒక్కరంటే ఒక్కరు కూడా టెక్నికల్ ఆపరేటర్ లేరు. ఇటీవల సగం బ్యారేజీ వద్దకు పెద్ద బోట్లు వరదలో కొట్టుకొచ్చిన సమయంలో కావచ్చు.. నెల్లూరు బ్యారేజీ వద్ద కార్తీకమాసం సందర్భంలో నీరు విడుదల చేయాల్సిన సమయంలో కావచ్చు... గేట్ల ఆపరేటర్లు లేక డీఈ, జేఈలే ఆ పనిచేయాల్సి వచ్చింది.

● సర్వేపల్లితో పొంచి ఉన్న ప్రమాదం

రెండు రోజుల క్రితం తిరుపతి జిల్లాలో ఓ చెరువుకు గండిపడడంతో ఓ దళితవాడ మొత్తం మునిగిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం లేకపోయినా, భారీగా ఆస్తి నష్టం జరిగింది. అంతటి చిన్న చెరువుకు గండిపడితేనే ఆ పరిస్థితి ఉంటే.. ఇక 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన సర్వేపల్లి రిజర్వాయర్‌కు గండి పడితే జరిగే ప్రమాదాన్ని ఊహించుకోవడం కూడా కష్టం. సుమారు పది గ్రామాలపై ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అంతటి ప్రాముఖ్యమైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్టలు బలహీనంగా మారాయి. 2015లోనే ఓసారి గండిపడడంతో అప్పుడు ఇసుక బస్తాలతో సర్దుబాటు చేశారు. గత డీఆర్సీ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చ జరగ్గా, వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మంత్రులు ఆదేశించారు. అయితే రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు వెళ్లినా ఇంతవరకూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోలేదు.

● నెలరోజులైనా దిక్కులేదు...

జిల్లాలో తీవ్రంగా దెబ్బతిన్న 18 ప్రధాన రోడ్లను బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.73.40 కోట్లతో నెల క్రితం అనుమతులు మంజూరు చేసింది. అప్పటికే దారుణంగా దెబ్బతిన్న ఆ రోడ్లు.. ఇటీవల మొంథా తుఫాన్‌తో మరింత గుంతలుగా మారిపోయాయి. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న మాదిరిగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, ఇప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవలేదు. కేవలం మూడు వర్కులకు మాత్రమే టెండర్లు పిలిచారు.

● నేడు ఐఏబీ సమావేశం

కీలకమైన రబీ సీజన్‌కు సంబంధించి సాగునీటి కేటాయింపుల కోసం సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం శనివారం జరగనుంది. డీఆర్సీ సమావేశం అనంతరం ఐఏబీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉంది. దీంతో ఈ దఫా ఉమ్మడి జిల్లాలోని పూర్తి ఆయకట్టులో సాగు జరగనున్నది. అయితే సాగునీటి యాజమాన్యంలో కీలకమైన లస్కర్ల నియామకానికి ఇంత వరకూ అనుమతులు రాలేదు. అలాగే కాలువల నిర్వహణకు ఓఅండ్ఎం పనులు కూడా చేపట్టలేదు.



చుక్కలనంటిన పొగనారు ధర

● మూట ఖరీదు రూ.6 వేలు ● ఆందోళనలో రైతులు

● వర్షాలకు దెబ్బతిన్న పొగాకు నారుమళ్లు

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా ఇటీవల 10 రోజులపాటు కురిసిన వర్షాలకు వలేటివారిపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పొగనారుమళ్లు దెబ్బతిన్నాయి. పొగనారుమళ్లకు కుళ్లు తెగులు వ్యాపించి నారంతా కుళ్లిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొలాలు కూడా ఆరలేదు. దీంతో పొగాకు నాట్లకు అదును దాటిపోయింది. వాతావరణం అనుకూలించి ఉంటే గతనెల 10 నుంచి నాట్లు వేయాలి. అయితే వర్షాలకు పొలాలు ఆరక నాట్లు ఆలస్యమయ్యాయి. అదును దాటిపోతుందనే ఉద్దేశంతో రైతులు ఒక్కసారిగా ఎర్ర, నల్లరేగడి భూముల్లో పొగ నాట్లకు సమాయత్తమయ్యారు. దీంతో అరకొరగా ఉన్న పొగనారు ధరలు చుక్కలనంటాయి. మూట రేటు రూ.6 వేలకు పెరిగింది.

ధర ఎక్కువైనా వేస్తున్నాం..

మొంథా తుఫాన్ ప్రభావంతో పొగనారు మడులు దెబ్బతిన్నాయి. దీనికితోడు ఎడతెరిపి వర్షాలకు పొలాల్లో తేమ ఆరలేదు. దీంతో దుక్కులు సాగలేదు. అదునులో పొగనాట్లు వేయలేకపోయాం. అదును దాటిపోయింది. ఆలస్యమైతే వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గిపోతాయి. దీంతో పొగనారు మూట ధర రూ.6 వేలు పెట్టి కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నాం.

- దామా చెంచయ్య, పొగాకు రైతు, కూనిపాలెం

యూరియా కోసం పడిగాపులు

● పనులు ఆపుకుని దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు

● మూడుసార్లే పంపిణీ అంటున్న వ్యవసాయాధికారులు

● మార్పాలంటున్న రైతులు

జలదంకి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్ మొదలైంది. ప్రారంభంలోనే రైతులు యూరియా కోసం ఇక్కట్లు పడుతున్నారు. యూరియా కోసం ముందుగా స్థానిక రైతు సేవా కేంద్రం(ఆర్ ఎస్‌కే)లో గ్రామ వ్యవసాయ సమాయకుడి(వీఏఏ)ని సంప్రదించి, రైతు భూమి పత్రాలు వన్‌బీ అడంగల్, ఆధార్‌కార్డు నకళ్లు అం దజేయాలి. వాటిని పరిశీలించాక యూరియా పంపిణీ కార్డును అందజేస్తారు. రికార్డులో పేరు లేకపోతే ఆ రైతు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ పేరు మీద భూమిని సరిచేయించుకుని వచ్చాక కార్డు మంజూరు చేస్తున్నారు. యూరియా పంపిణీ కార్డు మంజూరుకే రెండురోజులు పని మానుకుని రైతులు తిరగాల్సి వస్తోంది. ఇలా మంజూరైన కార్డుకు ఎకరానికి 3 బస్తాల యూరియా ఇస్తారు. అది కూడా మూడు విడతలుగా అందచేస్తారు. అంటే ఎకరా భూమి ఉండే రైతు మూడు బస్తాల యూరియా కోసం రెండు రోజులు రైతుసేవాకేంద్రం వద్దకు, మూడు దఫాలు ఆర్ఎస్‌కేకి వెళ్లాలి. మొత్తంమీద సీజన్‌లో ఐదుసార్లు రైతు వ్యవసాయశాఖ సిబ్బంది వద్దకు వెళ్లాలి.



● ఇదేమైనా న్యాయమా..?

యూరియా పంపిణీ విధానంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. 10, 20 ఎకరాలుండే రైతులైతే తప్ప .. ఒకటిరెండు ఎకరాలు ఉండే రైతు 'ఇన్నిసార్లు పోయి.. ఏం తెచ్చుకుంటాంలే.. అనే సందిగ్ధంలో పడుతున్నాడు. బ్లాక్ మార్కెట్‌లో కొనడం తప్ప... గత్యంతరం లేదనే భావనకు వస్తున్నారు. ఈ క్రమంలో అధిక ధరకు కొనుగోలు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులు సిద్ధపడి, ఆర్ఎస్‌కేలకు వెళ్లడం లేదు. కాగా అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని అధికారులు రేషన్ విధానం అమలు చేస్తున్నారు. ఈ విషయమై రైతులకు వారు అవగాహన కల్పించాల్సి ఉంది.

● కంపెనీల ప్రతినిధుల చేతివాటం

డీలర్లు ఎంతోకొంత ఎరువుల కంపెనీల ప్రతినిధులకు ముట్టచెబితే తప్ప.. వారు యూరియాను కేటాయించడం లేదు. లేనిపక్షంలో నానో ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. ఈ నానో ఎరువులపై రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఇలా సీజన్ మొదట్లోనే యూరియా పంపిణీ విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు యూరియా విషయాన్ని సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి, కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి రైతులకు సకాలంలో యూరియా అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

అయ్యోర్లకు ఆటలు

● 15 నుంచి పోటీలు

● ఒత్తిడిని అధిగమించేందుకే....

● రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహణ



నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. నిత్యం విధి నిర్వహణలో, పాఠాల బోధనలో బిజీగా ఉండే గురువులకు కాస్త ఆటవిడుపు కోసం రాష్ట్రంలోనే తొలిసారి క్రీడాపోటీల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు షెడ్యూల్‌ను విడుదల చేశారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడం, స్నేహపూరిత వాతావరణం కోసం క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● ప్రత్యేక కమిటీల ఏర్పాటు

జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) తరహాలోనే తమకు కూడా మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెబుతున్నారు. పోటీల నిర్వహణకు అధికారులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మండలస్థాయిలో పోటీల నిర్వహణ బాధ్యతను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌ను, ఎంఈవో-1, 2లను నిర్వహణ అధికారులుగా నియమించనున్నారు. అలాగే డివిజన్‌స్థాయిలో డివిజన్ కోఆర్డినేటర్, డిప్యూటీ డీఈవో, జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, డీఈవోలు, రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఏడీ, జేడీలు కోఆర్డినేటర్‌లు వ్యవహరిస్తారు.

● 15 నుంచి నిర్వహణ

అయ్యోర్ల క్రీడల పోటీల తేదీలను కూడా ఖరారు చేశారు. మండలస్థాయిలో నవంబరు 15, 16వతేదీల్లో, డివిజన్‌స్థాయిలో నవంబరు 22, 23వతేదీల్లో, జిల్లాస్థాయిలో నవంబరు 28, 29, 30వతేదీల్లో, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 6, 7 లేదా 13, 14, 15వతేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

అయ్యప్ప భక్తుల కోసం 50 ప్రత్యేక రైళ్లు



● ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండుచోట్ల స్టాపింగ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణమధ్య రైల్వే ఈనెల నుంచి జనవరి వరకు 50 ప్రత్యేక రైళ్లను ఉమ్మడి నెల్లూరు జిల్లా మీదుగా నడపనున్నది. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు గూడూరు రైల్వేస్టేషన్‌లో మాత్రమే వీటికి స్టాపింగ్ ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులు టికెట్ బుక్ చేసుకొని ఈ రెండు రైల్వే స్టేషన్లలో మాత్రమే రైలు ఎక్కడం, దిగడం చేయాలి. నవంబరు,డిసెంబరు,జనవరి నెలల్లో అయ్యప్ప భక్తుల ఎక్కువగా శబరిమలకు వెళ్లనున్న నేపథ్యంలో రైల్వేశాఖ ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది.

రైలు నెంబరు, ప్రయాణ తేదీల వివరాలు

రైలు నెంబరు	ప్రారంభ స్టేషన్	చివరి స్టేషన్	నవంబరు	డిసెంబరు	జనవరి
07101	మచిలీపట్నం	కొల్లాం	14, 21, 28	26	02
07102	కొల్లాం	మచిలీపట్నం	16, 23, 30	28	04
07105	నరసాపూర్	కొల్లాం	16, 23, 30	7, 14, 21, 28	04, 11, 18
07106	కొల్లాం	నరసాపూర్	18, 25	2, 9, 16, 23, 30	06, 13, 20
07107	చర్లపల్లి	కొల్లాం	17, 24	1, 8, 15, 22, 29	05, 12, 19
07108	కొల్లాం	చర్లపల్లి	19, 26	3, 10, 17, 24, 31	07, 14, 21

రేపు రాళ్లపాడు నీటి విడుదల

లింగసముద్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తిగా నిండినందున ఆదివారం ఉదయం 10 గంటలకు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ జీ మునిరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నందున, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రాజెక్టు నీటిని కాలువలకు విడుదల చేస్తారని ఆయన తెలిపారు.

● సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 17,496 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు వదులుతున్నామని, డ్యాంలో 71.467 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

● కండలేరులో 58.55 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత 58.55 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన పేర్కొన్నారు.

GLASS MANUFACTURING CO
UAE - SHARJAH
DIRECT CLIENT INTERVIEW AT TIRUPATI
FACTORY WORKERS (కర్మాగార కార్మికులు)
Age Limit 21-35 | 9th SUNDAY (09-11-2025)
SALARY : 1200 AED 8 HOURS DUTY + OT + ACCOMMODATION
Employment Visa
AMAN INTERNATIONAL HR CONSULTANT
SIA AGENCIES
504, First Floor, Shree Vignesh Towers
Leela Mahal Circle, Tirupati-517501
Cell : 7845828008, 9985928008

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 585	

పాఠశాల అభివృద్ధికి ఆర్టీసీ ఉద్యోగి విరాళం

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న గోళ్ల మాధవరావు తన స్వగ్రామమైన వెంకటాద్రిపాలెం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం రూ.35వేలు విరాళంగా అందించారు. పాఠశాల భవనానికి రంగులు, ముందు ఇనుపగ్రిల్స్ ఏర్పాటుకోసం ఈ మొత్తాన్ని వెచ్చించాలని చెక్కును శుక్రవారం హెచ్ఎం మృదులకు అందించారు.


హెచ్ఎంకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగి గోళ్ల మాధవరావు

తలసీమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సేవలు అపురూపం


పౌష్టికాహారం అందచేస్తున్న కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి దంపతులు

కావలి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తలసీమియా పీడిత చిన్నారులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అపురూపమైనవని కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య కొనియాడారు. శుక్రవారం అలేఖ్య, శ్రీకాంత్ దంపతులు స్థానిక రెడ్‌క్రాస్ తలసీమియా డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందజేశారు. చిన్నారుల తల్లి తండ్రులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించిన ఈ డే కేర్ సెంటర్ పలువురు చిన్నారులను ఆదుకుంటోందన్నారు. ఈ సెంటర్‌కు స్థానికంగానే కాకుండా ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా తలసీమియా చిన్నారులు చికిత్స కోసం వస్తున్నారన్నారు. వారికి రక్తం, మందులు, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ సెంటర్‌కు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైస్ చైర్మన్ కే. హరినారపరెడి, బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

జాతి ఐక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్



ఐక్యతా పాదయాత్రలో ఆర్డీవో వంశీకృష్ణ, ఎన్‌వైకే కోఆర్డినేటర్ మహేంద్ర రెడ్డి

కావలి (టౌన్) నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతి ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతీక అని ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఐక్యతా పాదయాత్ర నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్‌వైకె జిల్లా కోర్డినేటర్ మహేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో ముందడుగు వేయాలన్నారు. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ దేశ పురోగతికి యువత ప్రధాన శక్తి అన్నారు. ఆర్డీవో జెండా ఊపి ఐక్యతా పాదయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కందుకూరి సత్యనారాయణ, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, ఎన్జీవోలు అబ్దుల్ అలీం, రెహమాన్, దిలీప్, చేవూరి చిన్నా, జమీర్, ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కావలి ఆర్యవైశ్యసంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమం కరపత్రాన్ని శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన నివాసంలో ఆర్యవైశ్యసంఘ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీన బోగోలు మండలం ముంగమూరు క్రాస్‌రోడ్డు వద్ద వనమిత్ర ప్రాంగణంలో జరిగే కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆర్యవైశ్యనేతలు ఎమ్మెల్యేని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని మద్దూరుపాడు, చెన్నాయపాలెం, తుమ్మలపెంట, అన్నగారిపాలెం, ముసునూరు - 1, 2 సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

అల్లూరు : మండలంలోని నార్తుమోపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గ్రామాల్లో విద్యుత్ ఉండదని ఆయన కోరారు.

సోమేశ్వరాలయం, సాయిమందిరం ప్రారంభం

ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల


ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్లకు వేదమంత్రాలతో ఆశీర్వాదం ఇస్తున్న పూజారులు

జలదంకి, నవంబర్7(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం సోమవరప్పాడులో శుక్రవారం సోమేశ్వర ఆలయం, సాయిమందిరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ నిర్మాణ దాతలు చేవూరి జనార్దన్ రెడ్డి, సులోచనమ్మ దంపతుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొని వేదపండితుల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు ఆలయాలను ఒకేసారి నిర్మించి గ్రామంలో ఆధ్యాత్మికశోభను నింపిన చేవూరి జనార్దన్‌రెడ్డి, సులోచనమ్మలు అభినందనీయులన్నారు. మహాశివుడు, షిరిడీ సాయిబాబా ఆశీస్సులు ఆలయ నిర్మాణకర్తలతో పాటుగా ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు వేదపండితులు రఘుస్వామి, కళ్యాణ్‌స్వామి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు భజనలు చేశారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొండాపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడవళ్లూరు, కొమ్మి, తూర్పుఎర్రబల్లి మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. బెల్టు దుకాణాలలో మద్యం అమ్ముతున్నట్లయితే 9440902523 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

అంకమ్మ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే ఇంటూరి


అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో నిర్మించిన షాపులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంత ప్రజల ఇలవేల్పు అంకమ్మ ఆలయాన్ని భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకే కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ ఆలయానికి కనీస ఆదాయం లేక కరెంటు బిల్లులు కూడా కట్టలేని దుస్థితి ఉండేదని ప్రస్తుతం నిర్మిస్తున్న రూముల వల్ల ప్రతినెలా రెండున్నర లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందన్నారు. 24 షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా 19 గదుల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన అభివృద్ధి పనులన్నీ సవ్యంగానే పూర్తవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రోడ్ల విస్తరణ చేపట్టామని, సెంటర్ డ్రైనేజి వ్యవస్థను తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురళి, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ల రవిచంద్ర, మంగపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● అధికారులంతా విజన్ యాక్షన్ ప్లాన్‌తో పనిచేయాలి

అధికారులంతా 2047 విజన్ యాక్షన్‌ప్లాన్ ప్రకారం పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా కృషిచేస్తున్నారని అందుకనుగుణంగా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంపీడీఓ రత్నజ్యోతి, యంగ్ ప్రొఫెషనల్ అనిల్‌కుమార్, విజన్ స్టాఫ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

కందుకూరు పట్టణానికి చెందిన సీనియర్ వైసీపీ నేత గొర్రెపాటి శ్రీనివాసరావు, ఆయన వెంట పలు కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● న్యాయం చేయాలని వ్యాపారుల వినతి

లక్షల రూపాయలు అడ్వాన్సులు చెల్లించటమే గాక నెలనెలా క్రమం తప్పకుండా అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్న తమను అకస్మాత్తుగా ఖాళీచేయించటంతో తీవ్రంగా నష్టపోతున్నందున న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తిచేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను మొబైల్‌షాపుల యూనియన్ ప్రతినిధులతో కలిసి వ్యాపారులంతా తమగోడు వినిపించారు. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 10 షాపులు ఉండగా అందులో నాలుగు మొబైల్‌షాపులే ఉన్నాయని, అయితే మూడు రోజులక్రితం మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తుతో తమ దుకాణాలు ఖాళీచేయించి రూములకు తాళాలు వేయటంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణ సమయంలోనే ఇష్టానుసారం వ్యవహరించారని, దీంతో సమస్యలు వచ్చాయని వీలైనంత వరకు మీకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా వందేమాతరం దినోత్సవం



వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న అధికారులు, విద్యార్థులు



కందుకూరులో వందేమాతరం దినోత్సవంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది



కావలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వందేమాతరం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరు డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పట్టణ పోలీసుస్టేషన్‌లో విద్యార్థినీ విద్యార్థులచే గీతాలాపన చేయించారు. కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్ఐ శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలోను ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో వందేమాతరం దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్ ఆధ్వర్యంలో వందేమాతరం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వలేటివారిపాలెం : వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వలేటివారిపాలెంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు సెంటరు వరకూ ర్యాలీ చేశారు. ఈర్యాలీలో ఎంపీడీఓ శంకర్‌రావు, ఈఓఆర్డీ వెంకటనారాయణ, ఏఎస్ఐ బ్రహ్మయ్య, చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : భారత స్వాతంత్ర్యోద్యమంలో విశిష్టమైన దేశభక్తి గీతంగా వందేమాతర గీతం నిలిచిందని సీఐ జీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో వాసు పాఠశాల విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. భారతీయులందరినీ ఏక తాటిపైకి తెచ్చిన భావోద్వేగపూరితమైన చైతన్య గీతంగా వందేమాతర గీతాన్ని సీఐ అభివర్ణించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాజీబాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి : 'అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమరయోధుల రణనినాదం వందే మాతరం' అని నెల్లూరు జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షమీమ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుమేరకు ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో గ్యారేజీలో వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు నిండిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులు వందేమాతరం గీతాన్ని బృందగానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ షమీమ్ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలితంగానే అఖండ భారతావనికి స్వేచ్ఛ లభించిందన్నారు. ప్రతి ఒక్కరం హక్కులను అనుభవించడంతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించా లన్నారు. కావలి డిపో మేనేజరు డీ. ఆదినారాయణ స్వాతంత్ర్యోద్యమంలో బకింగ్‌చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గీతం ఎంతో ప్రభావం చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పన, బస్‌స్టేషన్ మేనేజరు ఎం రామక్రిష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ మల్లికార్జున వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు : వందేమాతరం గీతాన్ని ప్రతీ ఒక్కరూ ఆలపించి దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ రజనీకాంత్ పిలుపునిచ్చారు. బంకింగ్ చంద్ర చటర్జీ వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మండలాధికారులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుండి పాతబస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీడీఓ వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అల్లూరులో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న అధికారులు

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఉలవపాడులో సూపర్ లగ్జరీ బస్సుల స్టాపింగ్‌పై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న డీపీటీవో షమీం

ఉలవపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు డిపిటిఓ షమీం సూచించారు. మండల కేంద్రమైన ఉలవపాడు ఆర్టీసీ బస్టాండును డిపిటిఓ శుక్రవారం సందర్శించారు. సూపర్‌లగ్జరీ బస్సులు ఆగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌లగ్జరీ బస్సులు అన్నింటికీ ఉలవపాడు స్టేజీ ఇచ్చినట్లు, ప్రతి గంటకు ఉలవపాడు నుంచి విజయవాడ, నెల్లూరు వెళ్లుటకు సూపర్‌లగ్జరీ బస్సులకు స్టేజీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపిటిఓ కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం ఆదినారాయణ, సిఐ కల్పనా, ఎస్టీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు : పలువురికి గాయాలు


మాలకొండ వద్ద జాతీయ రహదారి మార్జిన్ దిగి పొలాల్లోకి వెళ్లిన కారు

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు పొల్లాల్లోకి దూసుకెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మాలకొండ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పామూరు నుంచి కందుకూరు వైపు వెళ్తున్న కారు మాలకొండ సమీపంలో నేషనల్ హైవే రోడ్డు మార్జిన్ దిగి పొల్లాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పలువురికి తీవ్ర గాయాలైనట్లు అటువైపు వెళ్తున్న వాహనదారులు తెలిపారు. గాయపడిన వారు ప్రయివేట్ వాహనంలో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది.

మెట్ల మార్గం విస్తరించాలని వినతి


మాలకొండలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లే మెట్లమార్గంలో భక్తుల రద్దీ

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి దర్శనం అనంతరం మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వెళ్లే మెట్ల మార్గం విస్తరణకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు, దర్శనం అనంతరం తిరిగి వచ్చేందుకు ఒకే మెట్లమార్గం అయినందున భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానికి వెళ్లేందుకు, దర్శనం అనంతరం తిరిగి వచ్చేందుకు వేర్వేరు క్యూ లైన్‌లు లేవు. ప్రమాదవశాత్తు తొక్కిసలాట జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. అంతేగాకుండా మెట్లు సక్రమంగా లేకపోవడంతో నడిచే సమయంలో భక్తులు పడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అమ్మవారి మెట్లమార్గాన్ని విస్తరించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

టీఆర్ఆర్‌లో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీఆర్ఆర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సెట్‌నెల్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో జిల్లా యువజన సంక్షేమశాఖ అనుబంధ సెట్‌నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్‌నెల్ సీఈఓ నాగేశ్వరరావు వ్యక్తిత్వ వికాసంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ, సెట్‌నెల్ మేనేజరు బి. శ్రీనివాసరావు, గయాజ్ అహ్మద్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాలేపాటి కుటుంబానికి వంటేరు పరామర్శ


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు తదితరులు

కావలి(దగదర్తి), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివంగత మాలేపాటి కుటుంబాన్ని దగదర్తిలోని వారి నివాసంలో శుక్రవారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, ఆయన సతీమణి ఇందిరమ్మ, కుమారుడు వంశీ క్రిష్ణలు పరామర్శించారు. సుబ్బానాయుడు, ఆయన సోదరుడి కుమారుడు బానుచందర్‌లు ఇటీవల మృతి చెందిన విషయం తెలసిందే. దీంతో వారిద్దరి చిత్ర పటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించా రు. టీడీపీ ఆవిర్భావం నుంచి మాలేపాటి పార్టీకోసం అంకిత భావంతో పనిచేశారన్నారు.

వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసు

కావలి (టౌన్) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తటవర్తి వాసు నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కా ర్యక్రమంలో ఐఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు చే తుల మీదుగా వాసు నియామక పత్రం అందుకున్నారు.


నియామకపత్రం అందుకుంటున్న వాసు

భర్తపై భార్య బంధువుల దాడి

కావలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం కనమళ్ల గ్రామానికి చెందిన తన్నీరు కోటేష్‌పై భార్య బంధువులు దాడి చేశారు.ఈ సంఘటన కావలి మద్దూరుపాడు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు, కనమళ్ల గ్రామానికి చెందిన కోటేష్ ఆదే గ్రామానికి చెందిన రాయి దీపికను రెండు నెలల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకుని శింగరాయకొండలోని పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరు మేజర్లు కావటంతో ఇరుకుటుంబాలను పిలిపించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. హైదరాబాద్‌లో సోలార్ ఫెన్సింగ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్న కోటేష్ భార్య దీపికతో హైదరాబాద్‌లో కాపురం పెట్టాడు. కోటేష్‌పై గతంలో పోక్సో కేసు ఉండటం తో వాయిదా కోసం ఉదయం ఒంగోలు కోర్టుకు వచ్చాడు. అనంతరం కనమళ్ల నుంచి కావలిలో స్నేహితునికి మోటారు సైకిల్ ఇచ్చివెళ్లేందుకు కోటేష్ అతని స్నేహితులైన సీతారాం, సత్యన్నారాయణతో కలిసి మోటారు సైకిల్ పై కావలి బయలు దేరాడు. మార్గ మధ్యంలోని మద్దూరుపాడు సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో భార్య దీపిక తండ్రి మారుతి, ఆయన కుమారుడు ముఖేష్, అయ్యప్ప మాలలో ఉన్న వారి బంధువులు మరో ఐదుగురు మోటారు బైక్‌ను ఆపి బీరు బాటిల్, కర్రతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో కోటేష్‌కు, ఆయన స్నేహితుడు సీతారాంకు గాయాలు కాగా, కోటేష్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వన్‌టౌన్ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే...!

● శిథిలావస్థలో పెంట్రాల యూపీ పాఠశాల

లింగసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలోని ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే పాఠశాలలోని మూడు తరగతి గదులు ఉరుస్తున్నా యి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలోని ఓ తరగతి గదిలో స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. దీంతో స్లాబు పెచ్చులు విద్యార్థులపై పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మరో రెండు తరగతి గదుల గోడలు నెర్రెలిచ్చి వర్షం కురిసినప్పుడు నీరు తరగతి గదిలోకి వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాలు కట్టి సుమారు 40 సంవత్సరాలకు పైగా అయ్యిందని గ్రామ మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, తదితరులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని, భవనాలకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.


శ్లాబు పెచ్చులూడిన యూపీ పాఠశాల

ఆధ్యాత్మికతతోనే పరిపూర్ణత

- తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి
- లక్ష దీపోత్సవంలో భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక సాధన లేనిదే జీవితం పరిపూర్ణం కాదని, కార్తీక మాసంలో నిష్టగా స్నానం ఆచరించి ఉసిరి వృక్షం ఉన్నచోట దీప ప్రజ్వలన చేయడం అత్యంత శ్రేష్టమని తుని శ్రీతాండవ కాశీ క్షేత్ర తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఉద్బోధించారు. నెల్లూరులోని వీఆర్ ఉన్నతపాఠశాల మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అజ్ఞానాన్ని నివృత్తి చేసుకోవాలంటే దీపారాధన మార్గమన్నారన్నారు. అలాంటి పుణ్యకార్యంలో ప్రజ లను భాగస్వాములను చేస్తున్న వేమిరెడ్డి దంపతులు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలను అభినందించారు. కాగా, లక్ష దీపోత్స వంలో భాగంగా శుక్రవారం ఉదయం రుద్ర హోమం, 108 మంది దంపతులతో మహాలక్ష్మీ అమ్మవారి లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొ న్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పండరినాథ స్వామికి లక్ష మల్లెలు, లక్ష తులసీదళాలతో అర్చన చేశారు. ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన స్ఫటిక లింగానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష దీపోత్సవం వంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వీఆర్సీ మైదానంలో శనివారం నిర్వహించనున్న శివపార్వతుల శాంతి కల్యాణోత్సవానికి సంబంధించి శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులతో కూడిన ప్రచార రథం శుక్రవారం నెల్లూరు చేరింది. దాని కి వేమిరెడ్డి దంపతులు, శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు వేమిరెడ్డి కోటారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.


అనుగ్రహ భాషణ చేస్తున్న తపోవన పీఠాధిపతి, చిత్రంలో దేవదాయ మంత్రి ఆనం, వేమిరెడ్డి దంపతులు తదితరులు

క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలి : వీఎస్‌యూ వీసీ

కావలి (టౌన్) నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ వీఎస్‌యు పీజీ కళాశాల ఆధ్వర్యంలో మహిళా అంతర్ కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరయ్యారు. రిజిస్ట్రార్ కె సునీత, డీన్ రమణారెడ్డితో కలిసి వీసీ క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులను ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి క్రీడాపోటీలకు పంపించి ప్రోత్సహిస్తున్నా మన్నారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, చదరంగం తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. శనివారంతో పోటీలు ముగియనున్నాయని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వీఎస్‌యు జట్లకు ఎంపిక చేస్తారని ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంఠ తెలిపారు. క్రీడాపోటీల అబ్జర్వర్ అమ్మాజీ, యూనివర్శిటీ సీనియర్ పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

కలెక్టరేట్‌ను మోడల్‌గా తీర్చి దిద్దుతాం

- లిఫ్టు ప్రారంభంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లిఫ్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అత్యాధునిక సాంకేతికతతో ప్రజలకు అవసరమైన అన్నీ వసతులను సమకూర్చుతామని వివరించారు. కలెక్టర్ ఛాంబర్ మొదటి అంతస్తులో ఉండటం వలన చాలా మంది తనను కలిసేందుకు వృద్ధులు, అనారోగ్య కారణాలతో వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వారి కోసమే ఈ లిఫ్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారులకు మంచి పోషణ అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. వయసుకు తగ్గ బరువు ఉండేలా చూడాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింసకు పాల్పడుతున్న వ్యక్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏ మహిళకు అన్యాయం జరుగకుండా వన్‌స్టాప్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్, నోడల్ అధికారి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజిస్టుల కొరత తీరేదెప్పుడు?

- 197 సెంటర్లకుగానూ 25 మందే..
- నేడు ప్రపంచ రేడియాలజీ దినోత్సవం
- వ్యాధుల గుర్తింపులో వాళ్లే కీలకం
- ప్రభుత్వాసుపత్రుల్లో పోస్టుల ఖాళీ
- ఐదు సీట్లు కావాలంటున్న ప్రభుత్వ వైద్యకళాశాల

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో రేడియాలజిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రాణాంతక వ్యాధులను నిర్ధారించాలన్నా వీరి అవసరం ఎంతైనా ఉంది. అయితే జిల్లాలో అనుకున్న స్థాయిలో మాత్రం వీరులేరు. ప్రత్యేకించి ప్రభుత్వరంగ సంస్థల్లో వీరిలోటు చాలా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 8న (నేడు) ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రపంచ రేడియాలజీ సొసైటీ తీర్మానించింది.

● ఉన్నది ఆరుగురే...

జిల్లావ్యాప్తంగా 52 పీహెచ్‌సీలతోపాటు 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే నెల్లూరులోని జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రులలో కేవలం ఆరుగురే రేడియాలజిస్టులు ఉన్నారంటే వీరి కొరత ఎలా ఉందో తెలుస్తోంది. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదు రేడియాలజీ పీజీ సీట్లకు అనుమతి కావాలని ప్రభుత్వానికి గత ఏడాది వైద్యాధికారులు నివేదికలు పంపారు. అయితే ప్రభుత్వం సీట్లు కేటాయించ లేదు. కొన్ని వ్యాధులకు సంబంధించి రేడియాలజిస్ట్ కొరత కారణంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాలకు వైద్యులు రెఫరల్ కోసం పంపిస్తుంటారు. ఆయా పరీక్షల ఫలితంగా వైద్య నిపుణులు చికిత్సలు అందిస్తున్నారు.

● 197 సెంటర్లకుగానూ 25 మందే..

జిల్లా వ్యాప్తంగా 197 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. అయితే రేడియాలజిస్టులు మాత్రం 25 మందే ఉన్నారు. 80 మంది రేడియాలజిస్టులు అవసరం ఉన్నా, వీరి కొరత ఎక్కువగానే ఉంది. నెల్లూరు జీజీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్‌లో ఓ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఉన్నారు. ఓ రెసిడెంట్ రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారు. అయితే ఈ ఆరుగురిలో ఇద్దరు వివిధ కారణాల తో సెలవులో ఉన్నారు. ఇక్కడ వైద్యకళాశాలకు మరో ఐదు పీజీ రేడియాలజీ సీట్లు కేటాయిస్తే, ఇక్కడ రోగులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ప్రతి రోజూ జీజీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్‌లో 30 ఎమ్మారై, 60 సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ 200, ఎక్స్‌రేలు మరో 200 తీస్తున్నారు. వీటన్నిటి రిపోర్టులను రేడియాలజిస్టులే రాస్తుంటారు. ఇక్కడ ల్యాబ్ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఒక్కోసారి రిపోర్టులు రావాలంటే 3 నుంచి 4 రోజులు పడుతుంది. దీంతో రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో రేడియాలజిస్టుల అవసరం ఎంతైనా ఉంది.



కొరత చాలా ఎక్కువే...



జీజీహెచ్ స్కానింగ్ సెంటర్‌లో రేడియాలజిస్టుల కొరత చాలా ఎక్కువగా ఉంది. దీంతో పలు వ్యాధులకు సంబంధించి రిపోర్టుల తయారీలో ఎంతో ఒత్తిడికి గురవుతున్నాం. ప్రభుత్వ వైద్యకళాశాలకు మరో ఐదు పీజీ సీట్లు కేటాయిస్తే కొంత వరకు కొరత తీరుతుంది.

- డాక్టర్ వెంపులూరి కుసుమ, రేడియాలజిస్ట్, జీజీహెచ్

త్వరగానే నివేదికలు అందిస్తున్నాం



ఎమ్మారై, సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ రిపోర్టులను ప్రతి రోజూ తీస్తున్నాం. ఈ నేపథ్యంలో ఎంతో ఒత్తిడికి గురవుతున్నా, రిపోర్టులను సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నాం. దీంతో ఎక్కువ సమయం జీజీహెచ్‌లోనే గడపాల్సి వస్తుంది. ఈ క్రమంలో రేడియాజిస్టులతోపాటు సహాయకులను కూడా నియమించాలి.

- డాక్టర్ మణికంఠ, జీజీహెచ్ స్కానింగ్ సెంటర్ రేడియాలజిస్ట్

జాయింట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీసు సబార్డినేట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త పిలుపు మేరకు నాయకులు నెల్లూరు జోన్ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, కావలి వాణిజ్య పన్నులశాఖ కార్యాలయాల ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింగరావు, కార్యదర్శి జే.సుజాతాబాయి మాట్లాడుతూ చిత్తూరు డివిజన్‌లో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ దళిత వర్గానికి చెందిన ఇద్దరు ఆఫీసు సబార్డినేట్లను కులం పేరుతో దూషించడమేకాక, చేయిచేసుకున్నారని ఆరోపించారు. ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆఫీసు సబార్డినేట్లకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీ. యానాది, ఉపాధ్యక్షుడు బీ.బాలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈ అనిల్, సంయుక్త కార్యదర్శి వీ.మధుసూధన్‌రావు, ట్రెజరర్ ఎస్కే రియాజ్, తదితరులు పాల్గొన్నారు.


కావలిలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

ఉత్కంఠ.. ఉద్వేగం..!

- హోరాహోరీగా హాకీ పోటీలు
- ఏసీ స్టేడియం జట్లకు ప్రథమస్థానం

నెల్లూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మ్యాచ్‌లన్నీ కూడా ఉత్కంఠ భరితంగా.. ఉద్వేగంగా జరిగాయి. భారత హాకీ శతజయంతోత్స వాలను పురస్కరించుకుని జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు క్రీడా జట్లు, క్లబ్‌లు తలపడగా పురుషుల విభాగంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం జట్లు ప్రథమస్థానం, మిక్స్‌డ్ జిల్లా జట్లు ద్వితీయస్థానం సాధించాయి. మహిళల విభాగంలో మాదరాజు గూడూరు ప్రథమస్థానం, శ్రీకొలను జట్టు ద్వితీయస్థానం దక్కించుకున్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు అందచేశారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను, కోచ్‌లను ఘనంగా సత్కరించారు. పోటీలకు ముందుగా శతజయంతిని పురస్కరించుకుని హాకీ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులు మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో పాండురంగారావు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు గాదం వాసు, హాకీ సంఘం జిల్లా కార్యదర్శి పీ.జగన్మోహన్, డాక్టర్ పీ.రవికుమార్, డాక్టర్ బాబు అగస్టీన్, డీఎస్‌ఏ హాకీ కోచ్ చందు, సీనియర్ క్రీడాకారులు కమల, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ప్రథమస్థానం సాధించిన పురుషుల జట్టు


విజేతలతో డీఈవో, అధికారులు

అబ్బురపరచిన ఒకేషనల్ ప్రదర్శనలు

- రాష్ట్రస్థాయికి పది ట్రేడ్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షల ఆధ్వర్యంలో నగరంలోని సంతపేట సెయింట్‌జాన్స్ పాఠశాలలో శుక్రవారం ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాస్థాయి స్కిల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 49 పాఠశాలల్లో పది ట్రేడ్‌లలో ప్రత్యేక శిక్షణ అందిస్తుండగా 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు పదివేల మందికిపైగా శిక్షణ పొందుతున్నారని చెప్పారు. వారు పొందిన శిక్షణతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని, దీనిలో ఎంతో మంది విద్యార్థులు ఆయా విభాగాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించి వారిని అభినందించారు.

● విజేతలు వీరే..


వృత్తి విద్యాకోర్సుల ప్రదర్శనల పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 500 మంది విద్యార్థులు 150 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించిన అధికారులు ఉత్తమ ప్రదర్శనలను విజేతలుగా ప్రకటించి రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. ఐటీ విభాగంలో దుత్తలూరు ఏపీ మోడల్ స్కూల్, ఎలక్ట్రానిక్స్‌లో రేవూరు జడ్పీ ఉన్నత పాఠశాల, బీఎఫ్‌ఎస్‌ఐలో ఇందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల, రిటైల్‌లో కేఎన్‌ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, అగ్రికల్చరల్‌లో కలువాయి వీవీఎస్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆపెరల్‌లో కేఎన్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆటోమోటివ్‌లో ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హెల్త్‌కేర్‌లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాల, ఫుడ్ ప్రాసెసింగ్‌లో కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలు ప్రథమస్థానాలు సాధించి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

పాదలకూరు పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ గ్రేడ్-4, పంచాయతీ కార్యదర్శి ఎం యశ్వత్‌సింగ్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో హౌస్ ట్యాక్స్ మాడ్యూల్‌లో ఇళ్లకు సంబంధించిన అసెస్మెంట్ నెంబర్లకు ఒకే మొబైల్ నెంబరును పంచాయతీ కార్యదర్శి తప్పుగా అనేక అసెస్మెంట కు అప్‌డేట్ చేశాడు. దీంతో ఏపీసీఎస్ (సీసీఅండ్ఏ) రూల్-8 కింద అతడిని జిల్లా కలెక్టర్ విధుల నుంచి అతడిని తప్పించారు. యశ్వంత్ సింగ్ మండలంలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీకి రెగ్యులర్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

ప్రజా ప్రయోజనాల కోసమే పరిశ్రమలు

- భూములివ్వాలని రైతులకు జేసీ సూచన



రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

కావలి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు ఏ ఒక్కరి ప్రయోజనం కోసమో కాదని, ప్రజల ప్రయోజనాలకే ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. పరిహారం తీసుకుని పరిశ్రమలకు అవసరమైన భూములు ఇవ్వా లని రైతులను కోరారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం రామాయపట్నంపోర్టు అనుబంధ పరిశ్రమలకు కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం, పెదపట్టపుపాళెం ప్రాంతాల్లో 2,190 ఎకరాల భూసేకరణ అంశంపై రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పరిహారం ఇస్తామన్నారు. గుడ్లూరు మండలం రావూరులో ఎకరాకు రూ.12.5 లక్షలు నిర్ణయించగా, అక్కడి రైతుల డిమాండ్ మేరకు ఎకరాకు రూ. 20 లక్షలు ఇచ్చామన్నారు. ఈ ప్రాంతం పరిశ్రమలకు అనుకూలమని ప్రభుత్వం పరిశ్రమలు మంజూరు చేసిందని, ఇక్కడి రైతులకు కూడా ఇదే ధర ప్రకారం పరిహారం ఇస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూములు తీసుకోవటం తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. దానిపై స్పందించిన రైతులు భూములను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న తమకు.. ఆ భూములు పోతే జీవనాధారం కరువవుతుందన్నారు. వ్యవసాయ భూముల్లో రెండు పంటలు సాగు చేస్తున్నందున రైతులే కాకుండా అనేకమంది కూలీలు, వ్యాపారులకు కూడా ఉపాధి లభిస్తోందన్నారు. పరిశ్రమలకు భూములు తీసుకుని ఏ కొద్ది మందికో ఉద్యోగాలు ఇస్తే.. మిగతా వారు ఎలా బతకాలని రైతులు ప్రశ్నించారు. మొదట తమకు ఉపాధి అవకాశాలు చూపించి ఆ తర్వాత భూములు తీసుకోవాలని, లేనిపక్షంలో భూములు ఇవ్వబోమని చెప్పారు. అందుకు జేసీ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మారిటైంబోర్డు డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకులో నకిలీ నోటు కలకలం

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం రూ. 500 నకిలీ నోటు కలకలం సృష్టించింది. సమీప సున్నంవారి చింతల గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పొదుపు సంఘానికి సంబంధించిన రుణ బకాయిలు బ్యాంకులో జమ చేసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న ఓ యువకుడితో రూ. 50వేలకు సంబంధించిన డిపాజిట్ ఫారమ్ రాయించుకొని క్యాషియర్ అజయ్ వద్దకు వెళ్లి నగదు అందజేసింది. దీంతో ఆ నగదును క్యాష్ కౌంటింగ్ మిషన్‌లో లెక్కించేందుకు ఉంచగా నకిలీ నోటు వెలుగు చూసింది. దీంతో ఆయన ఆ నోటును నకిలీగా నిర్ధారించి విషయాన్ని వృద్ధురాలికి తెలిపి మరో రూ.500 ఇవ్వాలని సూచించారు. ఆ సమయంలో ఆమె వద్ద నగదు లేకపోవడంతో చేసేదేమిలేక వెనుతిరిగి వెళ్లిపోయింది. మిగిలిన ఖాతాదారులు సైతం విషయం తెలుసుకొని విస్తుపోయారు. కాగా, ఈ విషయమై క్యాషియర్‌ను సంప్రదించగా నకిలీ నోటు తమ వద్దకు వచ్చిన విషయం వాస్తమేనని, మిగిలిన వివరాలు తాను తెలుసుకోలేదని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ.సత్యవాణి పిలుపునిచ్చారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యునిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కింద ఇన్‌టర్నల్ కమ్యునిటీ రీసోర్స్ పర్సన్స్(ఐసీఆర్‌పీ)లకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి తమ పూర్తి సహకారం ఉంటుందని, ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజ్‌కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజరు మునిరత్నంలు వ్యవసాయ సూత్రాలు, వ్యవసాయ శాస్త్రీయ విస్తృత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు వారి అనుభవాలను పంచుకున్నారు.

పోలీసులు సిబ్బంది సంక్షేమానికి వెల్ఫేర్ డే

- ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం కోసం ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది వారి సమస్యలను తనకు నిర్భయంగా తెలియజేసుకోవచ్చని తెలిపారు.

191 మంది ఎంపిక

పీఎంఎంఎస్‌వై లబ్ధిదారులుగా

- మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాలో 191 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కే.శాంతి తెలిపారు. శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో పీఎంఎంఎస్‌వై పథకం జిల్లాస్థాయి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకం అమల్లో భాగంగా వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆధ్వర్యంలో చర్చించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆమోదించామన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని లీడ్ డిస్ట్రిక్ మేనేజరుకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి, నీటిపారుదల, డీఆర్‌డీఏ శాఖల అధికారులు, మత్స్య కళాశాల ప్రొఫెసర్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

సర్పంచుకు షోకాజ్ నోటీసు

చేజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి చెందిన నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో చేజర్ల మండలం యనమదల గ్రామ పంచాయతీ సర్పంచ్ నోటి సుందర య్యకు గురువారం జిల్లా పంచాయతీ అధికారులు షోకాజ్ నోటీసు జారీచేశారు. పూర్తి వివరాల మేరకు... గ్రామానికి చెందిన బొగ్గల తిరపతిరెడ్డి ఫిర్యాదు మేరకు పంచాయతీశాఖ అధికారులు గ్రామంలో విచారించిన అనంతరం ఆర్వో ప్లాంటు నిధులు దుర్వినియోగం అయ్యాయని, సదరు పంచాయతీ సర్పంచ్ నోటి సుందరయ్యకు మూడు నెలల పాటు సర్పంచ్‌గా ఎందుకు సస్పెండ్ చేయకూడదో 15 రోజులలో వివరణ సమర్పించవలసిందిగా షోకాజ్ నోటీసును జారీచేశారు. లేకపోతే ఏపి పిఆర్ యాక్ట్ 1994 సెక్షన్ 249(6) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని షోకాజ్ నోటీసులో తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

కలిగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు సరదాగా సము ద్రతీరానికి వెళ్ళి కాసేపు సంతోషంగా గడిపి తిరిగి స్వగ్రానికి బయలుదేరారు. కాసేపట్లో గ్రామానికి చేరుకుంటారనగా ఇంతలో ప్రమాదం జరిగింది. ఈ ఘట నలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరు తీవ్ర గాయా లపాలైన ఘటన మండలంలోని పెద్దపాడుగ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి పంచా యతీ పరిధిలోని జిర్రావారిపాలెంకు అనుసంధానమైన కొప్పోలు వారిపాలెంకు చెందిన కొప్పోలు మనోజ్, తన స్నేహితుడు మురారి పెంచలప్రసాద్, ఇటీవల బెంగుళూరునుండి వచ్చిన పెంచలప్రసాద్ మేనమామ కొడుకు నక్కా కిరణ్‌లు ముగ్గురు కలిసి ఆటవిడుపుకోసం కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీర ప్రాంతానికి ఒకే మోటార్‌సైకిల్‌పై వెళ్ళారు. అక్కడ కాసేపు సరదాగా గడిపి కావలిలో పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. కావలి-కలిగిరి రహ దారిలో పెద్దపాడు గ్రామం వద్ద రోడ్డు మలుపు సూచికను వేగంగా ఢీకొనడంతో రోడ్డుకి దూరంగా ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో కొప్పోలు మనోజ్ (25) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వింజమూరు తరలించారు. నక్కా కిరణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ ఉమాశంకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు తరలించారు. మనోజ్ ఐటీఐ పూర్తిచేసి కొంతకాలంగా స్థానికంగా పనులకు వెళుతున్నాడు. కొప్పోలువారిపాలెం గ్రామస్థులు, మనోజ్ కుటుంబసభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. మనోజ్ మృతదేహాన్ని చూసి కన్నీళ్లపర్యంతమయ్యారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిం చేలా టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ నాయకుడు కొప్పోలు కొండలరావు సహకారం అందించారు. మనోజ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

ఇంట్లో చోరీ యత్నం

మనుబోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామపురంలోని గొలగమూడి అనసూయమ్మ ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఓ దొంగ చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. అన సూయమ్మ భర్త గతేడాది చనిపోవడంతో నెల్లూరులో కుమారుడి దగ్గర ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగ రెండు గేట్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అలికిడి కావడంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్ళు అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివరాకేష్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని చాకచక్యంగా దొంగను పట్టు కున్నారు. వెంటనే అనసూయమ్మ ఇంటికి చేరుకుంది. వస్తువులేవీ చోరీకి గురి కాలేదని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.